బుధవారం
16-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 115
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విమానయాన విస్తరణకు రూ.14 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలు, విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మెరుగుదలకు 2030 నాటికి 170 బిలియన్ డాలర్లు(రూ.14.11 లక్షల కోట్లు) ఖర్చు చేయాలని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. ఇప్పటికే విమానయాన సంస్థలు.. ఎయిర్‌బస్, బోయింగ్ కంపెనీలకు రికార్డు స్థాయిలో ఆర్డర్స్ ఇచ్చాయి. భారతీయ వియానయాన సంస్థలు కొనుగోలు చేయనున్న 1,700 ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఆర్డర్ల కోసం, కొత్త విమానాశ్రయాలను నిర్మించడానికి, ఉన్న విమానాశ్రయాలను విస్తరించడానికి ఈ నిధులు అవసరమవుతాయని నివేదిక పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటి.

నేడు మంత్రివర్గం భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. ఈ సమావేశంలో వివిధ శాఖల్లో అమలు చేయనునన్న నూతన విధానాలు చర్చకు రానున్నాయి. ముఖ్యంగా రానున్న 5 ఏళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేలా ఇప్పటికే నూతన విధానం రూపొందించారు. పరిశ్రమ వర్గాల అభిప్రాయాలు, పొరుగు రాష్ట్రాల్లోని ఉత్తమ విధానాలతో కొత్త విధానాలు రూపొందించారు. మంత్రివర్గ

- మిగతా 2 లో

భారత్‌కు ప్రిడేటర్ డ్రోన్లు

అమెరికాతో ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ: సరిహద్దు దేశాల నుంచి ముప్పు పొంచివున్నందున సైన్యాన్ని మరింత పటిష్టపరిచేలా భారత్ కీలక ఒప్పందం చేసుకుంది. అమెరికా నుంచి అత్యాధునిక సాయుధ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు ఒప్పందంపై మంగళవారం భారత్ సంతకం చేసింది. ఈ ఒప్పందం కింద భారత ప్రభుత్వం మొత్తం 31 ఎంక్యూ9బీ డ్రోన్లు కొనుగోలు చేస్తోంది. వీటికి ప్రత్యేక క్షిపణులు, లేజర్ గైడెడ్ బాంబులను కూడా జనరల్ అటామిక్స్ సంస్థ సమకూర్చనుంది. మొత్తం 31 డ్రోన్లలో 15 నౌకాదళానికి, 8 సైన్యానికి, మిగిలినవి

- మిగతా 2 లో

ఉచితాలపై కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై అత్యున్నత న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలైంది. దీనిపై కేంద్రంతో పాటు, భారత ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలను లంచాలుగా పరిగణించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు చేయ కుండా నిరోధించడానికి చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్‌ను

- మిగతా 2 లో

ఏపీకి వెళ్లాల్సిందే

ఐఏఎస్‌లకు క్యాట్‌లో చుక్కెదురు

నేడు రిపోర్ట్ చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'ఏపీ ప్రజలు వరదలతో ఇబ్బందులకు గురవుతుంటే... అక్కడకు వెళ్లి సేవ అందించాలని మీకు లేదా?' అంటూ ఐదుగురు ఐఏఎస్‌లపై కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) కీలక వ్యాఖ్యలు చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు క్యాట్ నిరాకరించింది. తెలంగాణ ఐఏఎస్‌లు ఏపీకి, ఏపీ ఐఏఎస్ తెలంగాణకు వెళ్లాల్సిందేనని, బుధవారం రిపోర్ట్ చేయాలని స్పష్టంచేసింది. క్యాట్ తీర్పుతో తెలుగు రాష్ట్రాల్లో చర్చ కొనసాగుతోంది. డీఓపీటీ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణిప్రసాద్, రోనాల్డ్‌రాస్ ఏపీకి రావాల్సి ఉంది. రాష్ట్రంలో పనిచేస్తున్న ఐఏఎస్ సృజన తెలంగాణకు వెళ్లాల్సి ఉంది. ఈనెల 9వ తేదీన కేంద్ర ప్రభుత్వం జారీజేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని ఐఏఎస్‌లు క్యాట్‌ను ఆశ్రయించారు. తమకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై మంగళవారం విచారణ కొనసాగగా... వారి అభ్యర్థనను క్యాట్ త్రోసిపుచ్చింది. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం మార్గదర్శకాలలో ఉందా? రాష్ట్రంలో ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, అక్కడకు వెళ్లి సేవ చేయాలని మీకు లేదా? అని ప్రశ్నించింది. ఐఏఎస్‌ల కేటాయింపులపై డీఓపీటీకి పూర్తి అధికారాలున్నాయని క్యాట్ సమర్థించింది. అటు ఏకసభ్య కమిటీ సిఫార్సులను డీఓపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్‌ల తరపు న్యాయవాది క్యాట్ దృష్టికి తీసుకొచ్చారు. కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీజేసే ముందు... కమిటీ నివేదిక ఇవ్వలేదని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని

- మిగతా 2 లో

ఎన్నికల నగారా

నవంబరు 20న మహారాష్ట్రలో ఒకే విడత పోలింగ్

- జార్ఖండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలు
- మిల్కీపూర్ ఉపఎన్నికపై ఈసీ దాటవేత

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల నగారా మోగింది. మహారాష్ట్రలోని 288 శాసనసభ స్థానాలకు నవంబరు 20వ తేదీన ఒకే విడతలో, జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు రెండు విడత(నవంబరు 13, నవంబరు 20)ల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం రెండు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. వీటితో పాటు వివిధ రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రెండు విడతల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో 288 స్థానాలకు గాను మొత్తం 9.63 కోట్లమంది ఓటర్లు ఉన్నారని, వారి కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. 20.93 లక్షల మంది తొలిసారి ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

జార్ఖండ్ ఎన్నికలు షెడ్యూల్ ఇలా...

జార్ఖండ్‌లో రెండు విడతల్లో ఎన్నికలు

జరగనున్నాయని సీఈసీ తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 2.69 కోట్లమంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. వారి కోసం 29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 11.84 లక్షల మంది తొలిసారి ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు సీఈసీ చెప్పారు.

మొదటి విడత:
- నోటిఫికేషన్ విడుదల తేదీ: అక్టోబర్ 18
- నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబర్ 25
- నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 28
- నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 30
- పోలింగ్ తేదీ: నవంబర్ 13

రెండో విడత:
- నోటిఫికేషన్ విడుదల తేదీ: అక్టోబర్ 22

- మిగతా 2 లో

మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ ఇలా...

నోటిఫికేషన్ విడుదల తేదీ: అక్టోబర్ 22
నామినేషన్ల స్వీకరణకు తుది గడువు: అక్టోబర్ 29
నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 30
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబర్ 4
పోలింగ్ తేదీ: నవంబర్ 20
ఎన్నికల ఫలితాల తేదీ: నవంబర్ 23

నేటి నుంచి కొత్త 'మద్యం'

- పూర్తయిన దుకాణాల కేటాయింపు
- రెచ్చిపోతున్న లిక్కర్ సిండికేట్లు
- కొనసాగుతున్న బెదిరింపుల పర్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఈనెల 16 నుంచి రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి రానుంది. అతి తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మందుబాబులు పడిగాపులు కాస్తున్నారు. ఈనెల

- మిగతా 2 లో

మద్యంపై 2 శాతం సెస్ విధింపు

ప్రొహిబిషన్-ఎక్సైజ్‌శాఖ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన మద్యం విధానానికి సంబంధించి ఆరంభంలోనే మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. మద్యంపై డ్రగ్స్ రిహాబిలిటేషన్ సెస్‌ను రెండు శాతం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రొహిబిషన్-ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం

- మిగతా 2 లో

మందలింపుకేనా ?

- 18న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చంద్రబాబు సమావేశం
- మద్యం, ఇసుక విక్రయాల్లో జోక్యం
- 'పట్టభద్రుల'ఎన్నికలే కీలకాంశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 18న సమావేశం నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీపరంగా ఎమ్మెల్యేలతో తొలిసారిగా భేటీ అవుతున్నారు. మద్యం, ఇసుక వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యాన్ని నివారించడం, పార్టీని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టడం, సభ్యత్వం పెంపు, అలాగే త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అభ్యర్థుల గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల అమలైన నూతన మద్యం పాలసీ అమల్లో భాగంగా కొందరు శాసనసభ్యులు తమ నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ప్రయత్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు కనీసం లక్ష దరఖాస్తులు వస్తాయని, తద్వారా రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. కానీ మితిమీరిన రాజకీయ జోక్యంతో తొలి మూడు రోజుల పరిస్థితి చూస్తే వాటిలో సగం కూడా రావని స్పష్టమైంది. అనేక నియోజకవర్గాల్లో చాలా స్వల్ప సంఖ్యలో దరఖాస్తులు అందాయి. కొన్ని షాపులకు అయితే ఒక్కొక్కటి మాత్రమే దరఖాస్తు అందాయి. దీనిపై ఎక్సైజ్ శాఖలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతలను హెచ్చరించడంతోపాటు, ఆయన సూచనలతో సీఎంఓ కూడా తీవ్రంగా స్పందించింది. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకుని మరీ దరఖాస్తులను అడ్డుకుంటున్న వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేసి గట్టిగా హెచ్చరించింది. నేరుగా సీఎం కార్యాలయం నుంచి హెచ్చరికలు రావడంతో చాలా మంది ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గారు. మరోవైపు ఎక్సైజ్ శాఖ కూడా దరఖాస్తుదారులకు ఆన్‌లైన్‌లో ఎక్కువ వెసులుబాటు కల్పించింది. సమాచారం కోసం ఎక్సైజ్ ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా మొత్తం వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టింది. దేశంలో ఏ ప్రాంతం నుంచైనా డబ్బు చెల్లించే

- మిగతా 2 లో



ఏపీకి ముప్పు

భయపెడుతున్న వాయుగుండం

దక్షిణకోస్తా, రాయలసీమకు హైఅలర్ట్

మెరుపు వరదలకు అవకాశం: ఐఎండీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ముప్పు పొంచింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షాలు, మెరుపు వరదలకు అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. దక్షిణ కోస్తా, రాయలసీమకు హై అలర్ట్ ప్రకటించింది. ఈనెల 17 అంటే గురువారం పుదుచ్చేరి, తమిళనాడు, దక్షిణ కోస్తా దగ్గర వాయుగుండం తీరం దాటుతుందని వెల్లడించింది. నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈనెల 16,17 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అకస్మాత్తు వరదలు సంభవించవచ్చని, రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి గంటకు 60కిలోమీటర్ల వేగంతో

- మిగతా 2 లో

'వెలిగొండ' పూర్తయ్యేదెన్నడు?

- ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పరిహారం కోసం రూ.2 వేల కోట్లు కేటాయించాలి
- ఆర్థిక మంత్రి కేశవ్‌కు రామకృష్ణ వినతి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు, నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం కోసం రానున్న బడ్జెట్లో రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టుకు నికరజలాలు సైతం కేటాయించాలన్నారు. ఈ మేరకు రామకృష్ణ నేతృత్వంలోని సీపీఐ బృందం మంగళవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులలో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు అత్యంత ప్రధానమైనది అన్నారు. రాష్ట్రంలో అత్యల్ప వర్షపాతం

- మిగతా 2 లో

ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల జీవో రద్దు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రైవేట్, అన్-ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకుగాను 25 శాతం విద్యార్థులకు రిజర్వేషన్ ఇవ్వాలంటూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేసింది. దీనిపై హైకోర్టులో మంగళవారం వాదోపవాదాలు కొనసాగాయి. చివరికి జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 24ను కొట్టివేస్తూ న్యాయస్థానం తుది తీర్పు

ఇచ్చింది. అమ్మఒడి ఇస్తుండటంతో ఒకటో తరగతిలో 25 శాతం వరకు పిల్లలను చేర్చుకోవాలని 2023-24 విద్యాసంవత్సరంలో జీవో 24ను గత ప్రభుత్వం జారీ చేసింది. దీనిని అప్పట్లోనే విద్యాసంస్థల నిర్వాహకులు హైకోర్టులో సవాల్ చేశారు. కోర్టులో విచారణ జరుగుతుండగానే 2023-24లో ఒకటో తరగతిలో 25 శాతం మంది పిల్లలను ప్రభుత్వం సూచించిన వారికి ప్రవేశాలు కల్పించాలంటూ ఆ జీవో ద్వారా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏపీ హైకోర్టు జడ్జిలుగా ముగ్గురు న్యాయవాదులు

సుప్రీం కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానానికి కొత్త జడ్జిలు రానున్నారు. న్యాయమూర్తులుగా నియమించేందుకు అర్హులైన ముగ్గురు న్యాయవాదుల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. కుంచం మహేశ్వరరావు, టి.చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్ పేర్లను మంగళవారం ప్రతిపాదించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన తెలిపింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి... మరో ఇద్దరు సీనియర్ జడ్జిలతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ

- మిగతా 2 లో

నిండుకుండలా శ్రీశైలం జలాశయం

తుంగభద్ర నుంచి నీటి విడుదలతో అధికారుల అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కృష్ణా పరివాహక ప్రాంతంలో వరదలు రావడంతో శ్రీశైలం జలాశయానికి పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరింది. దీంతో శ్రీశైలం జలాశయం నిండు కుండను తలపిస్తుంది. ఎగువ కర్నాటక ప్రాంతంలో వరదలు రావడంతో తుంగభద్ర ప్రాజెక్టు నుండి దిగువకు నీటిని విడుదల చేశారు. మంత్రాలయంలో ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. రాఘవేంద్రస్వామి మఠంఘాట్‌లను తాకి ప్రవాహం ఉధృతం కావడంతో భక్తులు, ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తుంగభద్ర నుండి సుంకేసులకు... అక్కడి నుంచి శ్రీశైలం జలాశయానికి నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయానికి ఎగువ జూరాల నుండి 53,216 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 84,840 క్యూసెక్కులు మొత్తం 1,36,056 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా శ్రీశైలం జలాశయం నుండి పోతిరెడ్డిపాడుకు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా

- మిగతా 2 లో



ఏపీకి వెళ్లాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. వాదనల అనంతరం డీఓపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు క్యాట్ నిరాకరించింది. ప్రతివాదులైన డీఓపీటీకి, కేంద్రానికి నోటీసులు జారీజేసింది. నవంబరు 5లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఆయా రాష్ట్రాలకు వెళ్లి రిపోర్ట్ చేయాలని ఐఏఎస్‌లకు ఆదేశాలు జారీజేసింది. దీంతో ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణిప్రసాద్, రోనాల్డ్‌రాస్ ఏపీకి రావడం అనివార్యమైంది. అటు రాష్ట్రానికి చెందిన ఐఏఎస్‌లు సృజన, హరికిరణ్ తెలంగాణకు వెళ్లాల్సి ఉంది. డీఓపీటీ ఆదేశాల మేరకు ఆయా ఐఏఎస్‌లు 16న రిపోర్ట్ చేయాల్సి ఉండగా... ఈలోగానే వారంతా ఆయా రాష్ట్రాల్లో రిలీవ్ కావాలి. ఇప్పటికే ఆయా అధికారుల స్థానంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ అధికారులను సిద్ధం చేసినట్లు తెలిసింది. క్యాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేసేందుకు ఐఏఎస్‌లు సిద్ధమైనట్లు సమాచారం.

ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

- నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబర్ 29
- నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 30
- నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: నవంబర్ 1
- పోలింగ్ తేదీ: నవంబర్ 20
- ఓట్ల లెక్కింపు తేదీ: నవంబర్ 23

ఉపఎన్నికల వివరాలు

దేశంలోని 47 అసెంబ్లీ స్థానాలకు, కేరళలోని వయనాడ్(రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ) పార్లమెంట్ నియోజకవర్గానికి నవంబర్ 13న పోలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఒక అసెంబ్లీ స్థానానికి, మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంట్ నియోజకవర్గానికి నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబరు 26తో ముగియనుంది. జార్ఖండ్ శాసనసభ గడువు వచ్చే ఏడాది జనవరి 5 వరకు ఉంది. ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ, శివసేన, ఎన్‌సీపీ (అజిత్ పవార్) పార్టీలతో కూడిన మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. జార్ఖండ్‌లో జేఎంఎం ప్రభుత్వం ఉండగా, ఈ పార్టీ ఇండియా ఐక్యసంఘటనలో భాగస్వామిగా ఉంది.

ఏపీకి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని రెవెన్యూ విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో ఉన్న మత్స్యకారులంతా వెనక్కి రావాలని సూచించారు. ప్రజా రవాణా, రైళ్ల రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది. విపత్తుల నిర్వహణ శాఖ కార్యాలయాన్ని సందర్శించిన హోం మంత్రి వంగలపూడి అనితకు సిసోడియా తాజా పరిస్థితులను వివరించారు.

వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

బంగాళాఖాతంలో వాయుగుండంగా ఏర్పడే అవకాశమున్నందున వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం అయింది. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నందున ముందస్తు చర్యల్ని తీసుకున్నది. ఈ మేరకు ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి తెలిపారు. సంబంధిత జిల్లాల్లోని ఎపిడెమిక్ సెల్స్ 24 గంటలూ అందుబాటులో ఉండటంతో పాటు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆమె చెప్పారు. పునరావాస శిబిరాల వద్ద వైద్య శిబిరాల్ని ఏర్పాటు చేశారని, గర్భిణీలకు ప్రసవ తేదీకి వారం రోజుల ముందుగా అన్ని సదుపాయాలున్న ప్రభుత్వాసుపత్రులకు తరలిస్తున్నట్లు తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో అక్కడి ఎపిడెమిక్ సెల్ నంబరును ప్రజలకు తెలియజేయాలని, రాష్ట్ర ఎపిడెమిక్ సెల్ నంబరు (9032384168)తో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాలు సమన్వయం చేసుకోవాలని పద్మావతి సూచించారు.

మద్యంపై 2 శాతం సెస్ విధింపు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీజేశారు. ఈ సెస్ ద్వారా దాదాపు రూ.100 కోట్ల ఆదాయం లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నిధులను డ్రగ్స్ నియంత్రణ, రిహాబిలిటేషన్ సెంటర్లకు ప్రభుత్వం వినియోగించనుంది. బుధవారం నుంచి నూతన మద్యం విధానం అమలులోకి రానుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం అదనపు ప్రివిలేజ్ ఫీజు కింద చిల్లర కాకుండా, తదుపరి పది రూపాయలకు పెంచుతూ సవరించారు. మద్యం బాటిల్ ఎంఆర్‌పీ ధర రూ.150.50 ఉంటే... దానిని రూ.160కు పెంచేలా అదనపు ప్రివిలేజ్ ఫీజు ఉంటుంది.

ముగ్గురు అధికారుల నియామకం

ఏపీ ప్రొహిబిషన్-ఎక్సైజ్‌శాఖలో ముగ్గురు అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీజేశారు. ఎక్సైజ్‌శాఖలో బి.అరుణరావు (జేసీ-అడ్మిన్), టి.నాగలక్ష్మి (జేసీ-డిస్టిలరీస్), వి.అనసూయ దేవి (జీఎం-ఏపీఎస్‌బీసీఎల్)ను నియమించారు.

నేడు మంత్రివర్గం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం ముందుకు దాదాపు 6 ప్రభుత్వ నూతన విధానాలు వచ్చే అవకాశం ఉంది. పారిశ్రామిక అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్, క్లీన్ ఎనర్జీ, ఎంఎస్‌ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులు తదితర అంశాలు కేబినెట్ ముందుకు తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ముందుగా పెట్టుబడులు పెట్టిన వారికి అదనంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు అదనంగా 10 శాతం ప్రోత్సాహకం ఇవ్వాలని ఇండస్ట్రియల్ పాలసీలో పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చే అంశంపై కసరత్తు చేశారు. ఒక కుటుంబం... ఒక పారిశ్రామిక వేత్త అనే అంశంతో ఎంఎస్‌ఎంఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తోంది. విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా ఉండేలా క్లీన్ ఎనర్జీ పాలసీని రూపొందించారు. ఇవిగాక ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఎప్పటినుంచి అమలు చేయాలనే అంశాలు చర్చకొచ్చే అవకాశం ఉంది.

గాజాలో 42 వేలు దాటిన మృతులు

హెజ్బుల్లాపై కనికరం చూపబోం: నెతన్యాహు

జెరూసలేం: ఇజ్రాయిల్ ఉత్తర గాజా, లెబనాన్‌లో భూతల, వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్‌ను వశపర్చుకోవాలని చూస్తోంది. గతేడాది అక్టోబరు నుంచి గాజాపై జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు 42 వేల మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు గాజా ఆరోగ్యశాఖ మంగళవారం తెలిపింది. అటు ఇరాన్, హెజ్బుల్లా పైనా ఇజ్రాయిల్ అక్కసు వెళ్లగక్కుతోంది. క్షిపణులు, బాంబులతోనే కాకుండా మాటలనూ తూటాల్లా వారిపై వాడుతోంది. తమ జోలికి వస్తే ఊరుకోమని పదేపదే హెచ్చరికలు చేస్తోంది. తాజాగా తమ సైనిక స్థావరంపై హెజ్బుల్లా డ్రోన్ దాడికి ప్రతిగా బీరుట్ లక్ష్యంగా దాడులను మరింత విస్తృతం చేస్తామని, కనికరం చూపబోమని, హెజ్బుల్లా లక్ష్యాలన్నింటిని ధ్వంసం చేస్తామని, లెబనాన్ మొత్తాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరించారు. ఇరాన్‌పై ప్రతిఘటన తీర్చుకోవాలన్నది ఇజ్రాయిలీల కోరికగా చెప్పుకున్నారు. తమ దేశ ప్రయోజనాల దృష్ట్యా దాడులు భీకరంగా సాగిస్తున్నట్లు సమర్థించుకున్నారు. అమెరికా సలహాలు తీసుకుంటూనే తమకు నచ్చినట్లుగా ముందుకెళతామని చెప్పుకొచ్చారు. అమెరికా సలహా మేరకు ఇరాన్ అణు లేక చమురు కేంద్రాలపై ఇజ్రాయిల్ దాడి చేయదని నెతన్యాహు కార్యాలయం ప్రకటించింది. 'అమెరికా చెప్పేది వింటాం. ఆదేశ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం. కానీ మా దేశ ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకుంటాం' అని నెతన్యాహు కార్యాలయం పేర్కొంది. ఉత్తర లెబనాన్ పట్టణంలో ఇజ్రాయిల్ విరుచుకుపడింది. వెస్ట్‌బ్యాంక్‌లోనూ బాంబుల వర్షం కురిపించింది. దక్షిణ లెబనాన్‌లోని 230కుపైగా హెజ్బుల్లా లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఉత్తర లెబనాన్ పట్టణంలో ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 21 మంది చనిపోయారు. ముందస్తు ప్రణాళికల ప్రకారం లెబనాన్, వెస్ట్‌బ్యాంక్‌ను లొంగదీసుకునేందుకు ఇజ్రాయిల్ దురాక్రమణ సాగిస్తోందని ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ ఆరోపించారు.

వెనిజులాలో తిరుగుబాటుకు మస్క్ ధనసాయం: మదురో

కారకస్: తమ దేశంలో తిరుగుబాటకు అమెరికాకు చెందిన వ్యాపారవేత్త ఎలన్ మస్క్ ధన సాయం చేశారని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిలియన్ డాలర్లను ఆయన వెచ్చించారని ఓ టీవీ కార్యక్రమంలో మాట్లాడిన సందర్భంగా మదురో తెలిపారు. వెనిజులా అధ్యక్షుడిగా మదురో ఇటీవల మూడవసారి ఎన్నికయ్యారు. ఆయనకు 51శాతం ఓట్లు వచ్చాయి. 2031 వరకు అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఇటీవల ఎక్స్ మాధ్యమంగా వెనిజులా వ్యవహారంలో దుమారం రేగింది. తమ ప్రభుత్వాన్ని గద్దె దించేలా ఫాసిస్టు తిరుగుబాటుకు మస్క్ ఆర్థిక సహకారాన్ని అందించినట్లు మదురో అన్నారు. వెనిజులాపై ఆధిపత్యం కోసం తమ దేశాన్ని రాజకీయ అనిశ్చితిలోకి నెట్టివేయాలని మస్క్ చూస్తున్నారన్నారు. ఇదిలావుంటే, ఇటీవల తీవ్రస్థాయిలో మాటల యుద్ధం... వ్యక్తిగత విమర్శలు, అవమానాల క్రమంలో ఎక్స్‌పై పది రోజుల నిషేధాన్ని వెనిజులా ప్రభుత్వం ఆగస్టులో విధించిన విషయం తెలిసిందే. జులైలో వెనిజులాలో తిరుగుబాటు జరగడంతో దేశం అట్టుడికిపోయిన సంగతి విదితమే.

ఏథెన్స్ విమోచనానికి 80 ఏళ్లు

ఎరుపెక్కిన గ్రీస్- కేకేఈ అధ్వర్యంలో అరుణ కవాతు

గ్రీస్: నాజీల నుంచి ఏథెన్స్‌కు విమోచనానికి 80ఏళ్లు అయ్యాయి. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) అధ్వర్యంలో 80వ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దఎత్తున అరుణ కవాతు జరిగింది. గ్రీస్ ఎరుపెక్కింది. శ్రామికులు, కార్మికులు, స్వీయ ఉపాధి పొందేవారు, వామపక్ష సానుభూతిపరులు, ప్రజల నుంచి ఆదరణ లభించింది. ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా సందేశమిచ్చేలా ప్రదర్శన సాగింది. అమెరికా-ఈయూ-నాటో క్రిమినల్ ప్రణాళికలను... ఇజ్రాయిల్ యుద్ధ నేరాలను... గ్రీస్ ప్రభుత్వ మద్దతును ప్రదర్శనకారులు తీవ్రంగా ఖండించారు. కేకేఈ ప్రధాన కార్యదర్శి కౌంట్సోంబస్ ప్రసంగిస్తూ ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలు, చరిత్ర నేర్పిన పాఠాలను వివరించారు. సామ్రాజ్యవాద యుద్ధాలకు దారితీసే అధికారులకు స్వస్తి పలకాలంటే శ్రామిక -కార్మిక-ప్రజా పోరాటాలతోనే సాధ్యమని అన్నారు. కార్మికశక్తి విప్లవాత్మక విజయానికి... సోషలిజం-కమ్యూనిజం నిర్మాణానికి ఉద్యమాలు అనివార్యమన్నారు. ఇదిలావుంటే ప్రజా పోరాటాలకు సంగీతం రూపేణ నివాళి అర్పించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని కేకేఈ ముగించింది.

దేశ రక్షణపై రాజకీయాలొద్దు

- దేశాభివృద్ధికి కలిసి ముందుకెళదాం
- రాజ్‌నాథ్ సింగ్ పిలుపు
- నేవీ రాడార్ సెంటర్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశ రక్షణపై రాజకీయం చేయొద్దని, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో నేవీ రాడార్ కేంద్రానికి వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి కొండా సురేఖ, నేవీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరు ఉందని, దేశాభివృద్ధిలో ఈ రాష్ట్రం పాత్ర కీలకంగా మారిందని అన్నారు. దేశ భద్రతకు వీఎల్ఎఫ్ కీలకమని, కమ్యూనికేషన్ వ్యవస్థకు ఈ కమాండ్ సెంటర్ పాత్ర ముఖ్యమని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. నావికా రంగాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యమని, దేశ రక్షణ విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గేది లేదని, ఏ అంశంలోనూ రాజీకి ప్రసక్తి ఉండదని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

తెలంగాణ మరో కీలక ముందడుగు: రేవంత్

దేశ రక్షణకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసిందని సీఎం అన్నారు. డిఫెన్స్, ఎన్ఎఫ్‌సీ కేంద్రాలతో హైదరాబాద్ గుర్తింపు సాధించిందని తెలిపారు. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా అని, దీనిపై కొందరు వివాదం చేస్తుండటం తగదన్నారు. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టులపై... దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వమని బీఆర్ఎస్ విమర్శలనుద్దేశించి రేవంత్‌రెడ్డి అన్నారు. తమిళనాడులో 1990లో ఇలాంటిదే ప్రారంభించారు కానీ అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదని, రెండో వీఎల్ఎఫ్ తెలంగాణలో ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలని సీఎం సూచించారు. 2017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి నిర్ణయాలన్నీ జరిగాయని, ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్ అంటే మేము ఒప్పుకున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టుపై వివాదం సమంజసం కాదని హితవు పలికారు.

మందలింపుకేనా ?

(మొదటిపేజీ తరువాయి)

వెసులుబాటును కల్పించింది. దీంతో ఇతర రాష్ట్రాలతో పాటు, విదేశాల్లో ఉండేవారు కూడా పెద్దసంఖ్యలో టెండర్ల దాఖలుకు పోటీపడ్డారు. దరఖాస్తుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. చివరి తేదీ గడువును కూడా మరో రెండు రోజులు పొడిగించడంతో, ఎక్సైజ్ శాఖ అంచనాకు తగినట్లుగా దాదాపు 90వేల మంది దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.18వేల కోట్ల ఆదాయం సమకూరింది. ఈనెల 16నుంచి కొత్త మద్యం షాపుల్లో అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. అయితే లాటరీలో షాపులు దక్కించుకున్న వారిని కూడా సిండికేట్ చేసి తమ గుత్తాధిపత్యంలో ఉంచుకునేందుకు కొందరు శాసనసభ్యులు ప్రయత్నిస్తున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి లాంటి వారు షాపులు ఎవరికొచ్చినా మాకు 20శాతం వాటా ఇవ్వాల్సిందేనని లాటరీ విజేతలను బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. అలాగే ఈనెల 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 108 కొత్త ఇసుక రీచ్‌ల ద్వారా రోజుకి 80వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ రెండు అంశాల్లో శాసనసభ్యులు జోక్యం చేసుకుంటే ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని సీఎం భావిస్తున్నారు. ఈ రెంటికీ ఎంత దూరంగా ఉంటే అంతమంచిదని సూచిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వానికి మచ్చ తీసుకురావడానికి, వైసీపీ ప్రభుత్వం అభాసుపాలు కావడానికి ఈ రెండు అంశాలను చంద్రబాబు కీలకంగా భావిస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఒకసారి చంద్రబాబు హెచ్చరించినప్పటికీ, మరోసారి ఈ సమావేశంలో ఘాటుగా హెచ్చరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే త్వరలో జరుగనున్న కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కూటమి అభ్యర్థుల గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై చంద్రబాబు మార్గనిర్దేశనం చేయనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేయడంలో, విపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో, పార్టీని స్థానికంగా బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, తదితర అంశాలపై కూడా చంద్రబాబు సూచనలు చేయనున్నారు.

భారత్‌కు ప్రిడేటర్ డ్రోన్లు

(మొదటిపేజీ తరువాయి)

వాయుసేనకు కేటాయించనున్నారు. ఈ ఒప్పందం మొత్తం విలువ 3.5 బిలియన్ డాలర్లని తెలుస్తోంది. ఆగస్టులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాలో పర్యటించిన సంద ర్భంగా ఆయన బృందానికి డ్రోన్ సామర్థ్యాలను ప్రదర్శించి చూపించారు. ఇప్పటికే పశ్చిమాసియా, అఫ్గాన్ సంక్షోభాల్లో ఈ డ్రోన్లు విరివిగా వాడారు. చైనాతో ఉన్న వాస్తవాధీన రేఖ వెంబడి ఉంచేందుకు ఇవి అవసరమని భారత్ భావిస్తోంది. చాలా ఎక్కువ ఎత్తులో విహరించగలిగే ఈ డ్రోన్లు ఏకబిగిన సుమారు 40 గంటలకుపైగా గాల్లో ఉండగలవు. ఇవి నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులను, 450 కిలోల బాంబులను మోసుకెళ్ల గలవు. ఇప్పటికే భారత్‌లో వీటిల్లో మరోరకమైన సీగార్డియన్ డ్రోన్లు వినియోగిస్తోంది. వీటిని కూడా జనరల్ అటామిక్స్ నుంచి లీజ్‌పై భారత్ తీసుకొంది. ఈ ఏడాది జనవరిలో కాంట్రాక్టు ముగియగా... మన నౌకాదళం మరో నాలుగేళ్లపాటు దీనిని పొడిగించింది.

ఉచితాలపై కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించాలని కోరారు. ఈ ఉచితాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతుందని తన అభ్యర్థనలో వెల్లడించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. ఇదే అంశంపై పెడింగ్‌లో ఉన్న అనేక కేసులతో కలిపి దీన్ని విచారించాలని సుప్రీం నిర్ణయించింది. ఈ క్రమంలోనే కేంద్రానికి, ఈసీకి నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది విజయ్ హన్సారియా ఈ అంశంపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు ఓటర్లపై తీవ్ర ప్రభావితం చూపడంతో పాటు ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల జీవో రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులిచ్చింది. అప్పట్లో ఆయా ప్రవేశాలు అన్నీ తుది తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాహక్కు చట్టానికి పూర్తి భిన్నంగా ఉందని, అన్ని చట్టాలను ఉల్లంఘించేలా ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. గత ప్రభుత్వం అనాలోచిత చర్యలతో 15 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వారిని కొనసాగించాలా...లేదా అనే అంశంపై గందరగోళం ఏర్పడింది. రెండు విద్యా సంవత్సరాలపాటు చదువు చెప్పినందుకుగాను తమకు ఫీజు ఎవరిస్తారని విద్యాసంస్థల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి కొత్త 'మద్యం'

(మొదటిపేజీ తరువాయి)

14న జిల్లా కలెక్టర్ల సమక్షంలో ఎక్కడికక్కడే లాటరీల ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 3396 మద్యం దుకాణాలకుగాను 89,882 దరఖాస్తులు పోటెత్తాయి. ఒక్కో దుకాణానికి సగటున 25 మంది దరఖాస్తు చేశారు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.1,798 కోట్ల ఆదాయం సమకూరింది. లైసెన్స్ ఫీజుల రూపంలోనూ ప్రభుత్వానికి భారీ ఆదాయం లభించింది. మద్యం టెండర్లలో కూటమి పార్టీల ఆధిపత్యం నడిచిందని, వాళ్ల అనుచరులే సిండికేట్‌గా మారి అధికంగా మద్యం దుకాణాలను కైవసం చేసుకున్నారన్న విమర్శలున్నాయి. అయితే కొన్ని చోట్ల టీడీపీ, జనసేనకు తోడు వైసీపీ కూడా సిండికేట్‌లో భాగమైంది. దుకాణాలు ఎవరికొచ్చినా ఆదాయం పంపకాలపై ఒప్పందాలు కుదిరిపోయాయి. ఈ దఫా మద్యం టెండర్లలో మహిళలు, విద్యావంతులు పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారు. చాలా చోట్ల లాటరీ ప్రక్రియలో దాదాపు 350 మద్యం షాపులు(10.2శాతం) మహిళలు దక్కించుకున్నారు. అయితే మహిళల పేరుపై దుకాణాలున్నా...తెర వెనుక నడిపించేదెవరో అందరికీ తెలిసిన విషయమే. విశాఖపట్నంలో అత్యధికంగా 20శాతం, అనకాపల్లిలో 18.4శాతం, మన్యంలో 17.3, ఎన్టీఆర్‌లో 17.7, శ్రీకాకుళంలో 15.2, విజయనగరంలో 15.7, నెల్లూరులో 13.2శాతం షాపులు మహిళలు కైవసం చేసుకున్నారు.కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన లాటరీలో రెండు దుకాణాలు ఇతర రాష్ట్రాలకు వారికి అదృష్టం వచ్చింది. ఒకటో నంబరు దుకాణం...కర్నాటక రాష్ట్రానికి చెందిన మహేశ్‌కు, రెండో నంబరు దుకాణం ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోకేశ్ చంద్‌కు కేటాయించారు. అనంతపురం జిల్లాలో ఓ బీజేపీ నేతకు ఏకంగా ఐదు దుకాణాలు వేలంలో దక్కించుకున్నారు. గతంలో మద్యం పాలసీలో అక్రమాలు జరిగాయన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా దుకాణాల కేటాయింపు చేపట్టినట్లు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. పక్క రాష్ట్రాల బ్రాండ్లను ప్రమోట్ చేసి..రూ.99కే నాణ్యమైన మద్యం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు సరఫరా చేసేందుకు నాలుగు జాతీయ కంపెనీలు ముందుకొచ్చాయి. తొలుత 2లక్షల కేసులు దుకాణాలకు సరఫరా చేసి, వినియోగదారుల స్పందన ఆధారంగా కేసులు పెంచాలని ప్రతిపాదించారు. త్వరలో ధరల సవరణకు కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త బ్రాండ్లు, ఉన్న బ్రాండ్లపై ధరల సవరణను ఆ కమిటీ నిర్ణయించి. ఆ తర్వాత కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మద్యం విక్రయాలు కొనసాగుతాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్-ఎక్సైజ్‌శాఖ ఆదేశాలు జారీజేసిన విషయం విదితమే.నూతన మద్యం విధానం అమలుపై అధికారులతో సీఎం సమీక్షించి దిశానిర్దేశం చేశారు. అన్ని మద్యం దుకాణాల్లోను నాణ్యమైన మద్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయనుంది. దుకాణాల్లోకి కొత్తగా ప్రీమియం బ్రాండ్లు అందుబాటులోకి వస్తాయి. ఇక ప్రతి మద్యం దుకాణంలోనూ ఆన్‌లైన్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం లభించనుంది.

కొనసాగుతున్న లిక్కర్ సిండికేట్ బెదిరింపుల పర్వం

లాటరీలు పూర్తయ్యాక కూడా లిక్కర్ సిండికేట్ నిర్వాహకులు బరితెగిస్తున్నట్లు సమాచారం. లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్నవారిని కొందరు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు బెదిరింపులకు గురి చేస్తున్నారు. వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామంటూ ఇప్పటికే కొంతమందిని హెచ్చరించడంతో లాటరీ లో దుకాణాలు దక్కించుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. చాలా నియోజకవర్గాల్లో తమవారికి షాపులు రాకపోవడంతో ఎమ్మెల్యేల అనుచరులు రంగంలోకి దిగి...హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కడప, కర్నూలు, పల్నాడు జిల్లాల్లో ఈ బెదిరింపుల పర్వం ఊపందుకుంది. దీంతో లైసెన్సులు పొంది ఫీజులు చెల్లించిన దరఖాస్తు దారులు కలవరానికి గురవుతున్నారు. జిల్లాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు సిండికేట్లుగా మారి దుకాణాలను కైవసం చేసుకున్నారు. రాబోయే ఐదేళ్లలో పెద్దమొత్తంలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో విక్రయించి, ప్రభుత్వం అనుమతిచ్చిన డిస్టిలరీలద్వారా అమ్మకాలు భారీ స్థాయిలో పెంచేసి వేలకోట్ల రూపాయల అక్రమ రాబడికి ద్వారాలు తెరిచారన్న విమర్శలున్నాయి. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలోకి ప్రైవేట్ మద్యం దుకాణాలు రానున్నాయి. ఇంతవరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన 15వేలమంది సేల్స్‌మేన్లు, సూపర్ వైజర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో వారిని అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఉన్న పళంగా ఉపాధి కోల్పోవడంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది.

'వెలిగొండ' పూర్తయ్యేదెన్నడు?

(మొదటిపేజీ తరువాయి)

సమోదవుతూ, కరువుతో అల్లాడుతున్న ప్రకాశంజిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు ఈ ప్రాజెక్టు వరదాయిని వంటిదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సంబంధించి మొత్తం 36 మండలాలను కరువు బారినుండి విముక్తి చేసే అవకాశం ఉందన్నారు. అలాగే 16 లక్షల ప్రజానీకానికి తాగునీరు అందించవచ్చని తెలిపారు.

1996లో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన గావించిన వెలిగొండ ప్రాజెక్ట్‌కు సంబంధించి గడిచిన 28 సంవత్సరాలలో 80% ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇంకా కొన్ని కిలోమీటర్ల మేర 2వ టన్నెల్ పనులు, లైనింగ్‌వర్క్ టన్నెల్ నుండి రిజర్వాయర్‌లోకి నీరు వచ్చే కెనాల్ లైనింగ్ వర్క్ (5 కిలోమీటర్లు), ఇతరత్రా అసంపూర్తిగా ఉన్న కెనాల్ వర్క్‌ను పూర్తి చేయడానికి రూ.800 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించి 11 గ్రామాలలో 7500 మందిని లబ్ధిదారులుగా ప్రభుత్వం గుర్తించిందని... వారికి పరిహారం నిమిత్తం ఇంజనీరింగ్ వర్గాల అంచనా మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.1000 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని తెలిపారు. మొత్తంగా ప్రాజెక్టు పరిపూర్తికి మొత్తం రూ.2 వేల కోట్లు అవసరమవుతాయని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి, నీరు ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. అంతేకాక గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేయటం ద్వారా కృష్ణానది నుండి కృష్ణాడెల్టాకు రావలసిన 80 టీఎంసీల నికరజలాలను శ్రీశైలం రిజర్వాయర్‌లోనే నిల్వచేసి... వెనుకబడిన ప్రకాశం, రాయలసీమ జిల్లాలకు కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకువచ్చేందుకు తగు చర్యలు చేపట్టవలసిందిగా రామకృష్ణ కోరారు. ఈ అంశంపై మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, జిల్లా నాయకులు ఆర్.వెంకట్రావ్, కె.వీరారెడ్డి ఉన్నారు.

నిండుకుండలా శ్రీశైలం జలాశయం

(మొదటిపేజీ తరువాయి)

సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకర్తి లిఫ్టు ఇరిగేషన్ నుండి 800 క్యూసెక్కులు, ఏపీ జలవిద్యుత్‌కు 30,018 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్‌కు 35,215 క్యూసెక్కులు మొత్తం కలిపి 1,41,141 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883.40 అడుగులకు చేరుకుంది. పూర్తి నీటి సామర్థ్యం 215.8070 టీఎంసీలుకాగా ప్రస్తుతం 203.1165 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరదఉధృతి మరింత పెరిగితే స్పిల్‌వే గేట్ల ద్వారా మరోసారి దిగువ సాగర్‌కు నీరు విడుదల చేయవలసి వస్తుంది. తుంగభద్ర నుండి పెద్దఎత్తున నీరు వస్తుండటంతో జిల్లా అధికారులు పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కర్నూలు నగరంలోని తుంగభద్ర నది ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ముగ్గురు న్యాయవాదులు

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురి పేర్లను కొలీజియానికి సిఫార్సు చేశారు. ఈ ముగ్గురు న్యాయమూర్తులుగా అన్ని విధాలా అర్హులని భావించిన కొలీజియం వారి పేర్లను తాజాగా సిఫార్సు చేసింది. కుంచం మహేశ్వరరావు, చల్లా గుణరంజన్‌పై నలుగురు కన్సల్టీ జడ్జిల నుంచి సానుకూల సమాధానాలు రాగా అడ్వకేట్ ధనశేఖర్ విషయంలో ఒకరు అభ్యంతరం తెలిపినట్లు కొలీజియం వెల్లడించింది. ధనశేఖర్ బీసీ అని, ఆయన గురించి మిగతా అన్ని అంశాలు, పనితీరు, సామర్థ్యాన్ని తెలుసుకున్న తర్వాతే హైకోర్టు జడ్జిగా పేరు సిఫార్సు చేసినట్లు తెలిపింది ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు మొత్తం 37 జడ్జిలు మంజూరు కాగా ప్రస్తుతం 26 మంది న్యాయమూర్తులే ఉన్నారు.

జగన్ విలాసాలకు రూ.5 వేల కోట్ల ప్రజాధనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.5 వేల కోట్ల ప్రజాధనాన్ని తన విలాసాల కోసం దుర్వినియోగం చేశారని టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ దుర్వినియోగం చేసిన రూ.5 వేల కోట్లతో ఐదేళ్ల పాటు 3 లక్షల మంది వృద్ధులకు పింఛన్, 6 లక్షల మంది పిల్లలకు అమ్మఒడి, 8 లక్షల మంది రైతులకు ప్రతి ఏడాది రైతు భరోసా అందించవచ్చని చెప్పారు. అలాగే పేదవారికి 1.5 లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వచ్చని వివరించారు. పేద ప్రజలు ఆయనను క్షమించాలంటే అప్పనంగా దుర్వినియోగం చేసిన ప్రజాధనాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు చుట్టూ నిర్మించుకున్న ఇనుప కంచెకు అయిన ఖర్చు సాధారణ పరిపాలన శాఖ లెక్కల ప్రకారం రూ.12.85 కోట్లు అని ఆయన తెలిపారు. ప్రపంచంలో ఎవరూ కూడా తమ ఇంటికి కంచె కట్టుకుని ఉండరని అన్నారు.

గుంటూరు వాసులకు శుభవార్త

శంకర్ విలాస్ వంతెన 4 లైన్ల విస్తరణకు రూ.98 కోట్లు

మంత్రి పెమ్మసాని ప్రతిపాదనకు గడ్కరీ ఆమోదం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో గుంటూరు ప్రజల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించినట్లు అయింది. శంకర్ విలాస్ వంతెన నాలుగు లైన్ల విస్తరణ-ఆర్‌వోబీ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న పెమ్మసాని కృషికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ప్రకటించింది. సీఆర్ఐఎఫ్ పథకం కింద ఆయా నిర్మాణాలకు రూ.98 కోట్లు మంజూరు చేస్తున్నట్లుగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్వర్యంలో జులై 30వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి శంకర్ విలాస్ వంతెన విస్తరణ-రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపగా... కేంద్ర ప్రభుత్వం రూ.98 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు సంబంధిత శాఖాధికారులతో పెమ్మసాని సమీక్షలు నిర్వహించారు. కేంద్రప్రభుత్వంతో చర్చలు జరిపారు. జగన్ ప్రభుత్వంలో అనేక ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా... అప్పటి పాలకులు గుంటూరు అభివృద్ధికి మొగ్గుచూపులేదు. 2021లో గుంటూరు పార్లమెంటు పరిధిలోని 38 నిర్మాణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో చివరి ప్రాధాన్యతగా శంకర్ విలాస్ వంతెన నిర్మాణం ఉంది. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆయా ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు.

గడ్కరీకి చంద్రబాబు కృతజ్ఞతలు: రాష్ట్రంలో రోడ్లు, గుంటూరులో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సీఆర్ఐఎఫ్ పథకం కింద రాష్ట్రంలో 200.6 కిలోమీటర్ల మేర 13 రాష్ట్ర రహదారులకు రూ.400 కోట్లు మంజూరయ్యాయని సీఎం వివరించారు. గుంటూరులో వంతెనకు రూ.98 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కేటాయింపులు ఏపీ అభివృద్ధి, పురోగతికి మరింత ఉపయోగపడతాయని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.



సీఎం సహాయనిధికి విరాళాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి సహాయ నిధికి దాతలు విరాళం అందించారు. మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడును సచివాలయంలో దాతలు కలిసి వరద బాధితుల కోసం విరాళాల చెక్కులను అందించారు. తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.83 లక్షల విరాళాన్ని నియోజకవర్గ కూటమి నేతలు, ప్రజల భాగస్వామ్యంతో ఇచ్చారు. ఏపీ మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రూ.5 లక్షలు, శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ రూ.2 లక్షలు, వీఆర్ఆర్ వైభవ్ ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ రూ.2 లక్షల 50 వేలు, వాకర్స్ ఇంటర్నేషనల్ ఎన్టీఆర్ డిస్ట్రిక్ రూ.లక్షా 72 వేలు, కేసీ హరి, పత్తికొండ టీడీపీ పరిశీలకులు రూ.లక్షా 61 వేల 300, డబ్ల్యూబి ఫౌండేషన్ ట్రస్ట్ నెల్లూరు రూ.లక్షా 50 వేలు, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల-గుడివాడ రూ.లక్షా 16 వేల చొప్పున విరాళం ఇచ్చారు. కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థలు రూ.లక్షా 16 వేలు, కనుమూరి బాజిబాబు రూ.లక్ష, ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్, పీలేరు రూ.లక్ష, సత్యనారాయణ కొండమూరి రూ.లక్ష, మడకా రాంబాబు రూ.లక్ష, తెలుగునాడు అంగన్వాడీ యూనియన్ రూ.లక్ష, గుల్లంపూడి ఆనంద్ రూ.48 వేలు, వెలుగు గ్రామ సంఘం గోకవరం రూ.30 వేలు, ధీరజ్ చౌదరి రూ.30 వేలు, ఎస్.గోకర్ణేశ్వరరావు రూ.10 వేల చొప్పున సీఎంకు విరాళాలను అందజేశారు.

అత్యాచారాలపై ప్రత్యేక కోర్టుల విచారణ: మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అత్యాచార కేసుల్లో సత్వరమే న్యాయం జరిగేలా ప్రత్యేక కోర్టులతో విచారణ జరిపించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇటీవల సత్యసాయి జిల్లా, బాపట్లలో జరిగిన అత్యాచారాల కేసులను 48గంటల్లోగా ఛేదించినట్లు గుర్తుచేశారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఈ రెండు కేసులను ప్రత్యేక కోర్టుకు అప్పగించేందుకు వీలుగా రాష్ట్ర హైకోర్టుకు లేఖ రాశామన్నారు. సచివాలయం... పబ్లిసిటీ సెల్‌లో డీజీపీ ద్వారకా తిరుమలరావు, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్‌తో కలసి ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, లైంగిక దాడుల కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. శాంతి భద్రతల పటిష్టతకు అన్ని ముఖ్య కూడళు ,, ప్రాంతాలు, ప్రార్థనాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాలు, విద్యాసంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు ప్రాంగణాల్లోని సీసీ కెమెరాలను పోలీస్ శాఖతో అనుసంధానం చేయడం ద్వారా దోషులను త్వరగా పట్టుకునేందుకు వీలుంటుందని, ఇందుకోసం పోలీస్ శాఖకు సహకరించాలని రాష్ట్ర ప్రజలను మంత్రి అనిత కోరారు.

జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

ఏఐఎస్ఎఫ్ నేత సాయికుమార్ డిమాండ్

విశాలాంధ్రబ్యూరో-మచిలీపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులందరూ పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారని, అటువంటి వారికి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరచాలని కోరారు. ఆ విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నందున మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లే అవకాశం లేదన్నారు. ఒకవేళ బయట తినాలంటే తగిన ఆర్థిక స్తోమత ఉండదని, పేద విద్యార్థుల గురించి ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ సాదిక్ బాబు, నాయకులు కార్తీక్, నాని, సంతోశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ధరలకు రెక్కలు

అత్తిలి విమల, శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పెందుర్తి (విశాఖ జిల్లా) : సామాన్య ప్రజలను దోచుకుంటున్న దళారి వ్యవస్థను కట్టడి చేయటంలో ఎన్డీఏ కూటమి పాలకులు వైఫల్యం చెందారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అత్తిలి విమల, పెందుర్తి నియోజకవర్గం కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం పెందుర్తి రైతు బజార్ వద్ద రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తిలి విమల, శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయని, ఎన్నికల్లో గెలవక ముందు అనేక వాగ్దానాలు గుప్పించి, అనంతరం నిత్యావసర సరుకులు ధరలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నారని మండిపడ్డారు. తక్షణమే దళారీ వ్యవస్థ ఆగడాలను అరికట్టి ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఒక వైపు ఇసుక పాలసీ విధానం వలన రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది భవన నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి అవకాశాలను కోల్పోయి ఉంటే ప్రస్తుత ధరలతో కోట్లాది కుటుంబాలు సతమతవుతున్నాయని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ఎర్ర జెండాతో ప్రజా ఉద్యమంగా మలిచి ప్రభుత్వ పునాదులు కదిలేలా ఉధృతమైన ఆందోళనను నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు, అన్నపూర్ణ, పెందుర్తి ఏరియా నాయకులు ఎన్.అసిరినాయుడు, ఎ.రమణ, కె.రామారావు, అరుణ, రజినీ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం ఎన్‌కౌంటర్‌పై స్వతంత్ర దర్యాప్తు

హెచ్‌ఆర్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం బోడగుట్ట అటవీ ప్రాంతంలో సెప్టెంబరు 5వ తేదీ తెల్లవారు జామున ఆరుగురు మావోయిస్టులను (అందరూ ఆదివాసులే) కాల్చి చంపిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మానవహక్కుల వేదిక(హెచ్‌ఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. ఆ సంఘటనపై సీబీఐ, తెలంగాణ రాష్ట్ర పోలీసులతో సంబంధం లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించాలని కోరింది. ఈ మేరకు హెచ్‌ఆర్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్.తిరుపతయ్య, తెలంగాణ-ఆంధ్ర సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ముగ్గురు సభ్యులతో కూడిన హెచ్‌ఆర్ఎఫ్ నిజనిర్ధారణ బృందం అక్టోబరు 13న కరకగూడెం, పినపాక మండలాల్లోని గ్రామాలను సందర్శించి స్థానికులతో మాట్లాడింది. పోలీసులు చెబుతున్నట్లు రెండు వైపులా కాల్పులు జరగలేదని మా నిర్ధారణలో తేలింది. దట్టమైన అడవిలో తెల్లవారుజామున మావోయిస్టు దళంపై ఏకపక్ష కాల్పులు జరిగినట్టు స్పష్టమవుతోంది. 'మావోయిస్టులపై పోలీసులు హత్యా ప్రయత్నం చేసారన్న నేరం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే అది చట్ట ప్రకారం సరిపోదు. ఆరుగురు వ్యక్తులపై కాల్పుల సంఘటనలో పాల్గొన్న పోలీసులందరిపైనా హత్యా నేరం కింద, ఇంకా ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసులు నమోదు చేయాలి. పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారా లేదా అన్నది నిర్ధారించాల్సింది న్యాయస్థానం... పోలీసులు కాదు. రెండు వైపులా కాల్పులు జరిగాయని ఏకపక్షంగా నిర్ధారించేసి కేసు మూసివేస్తే అది చట్టాన్ని, రాజ్యాంగాన్నీ అపహాస్యం చేసినట్లు అవుతుంది' అని ఆ ప్రకటన తెలిపింది.మావోయిస్టు ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్‌ఆర్ఎఫ్ విన్నవించింది. మావోయిస్టులు వారి రాజకీయ వ్యూహంలో భాగంగా హింసను ప్రయోగిస్తారన్నది వాస్తవామే గానీ అది ప్రధానంగా రాజకీయ ఉద్యమం. దాన్ని రాజకీయంగానే ఎదుర్కోవాలిగాని వన్యమృగాలను వేటాడినట్టు చుట్టుముట్టి కాల్చి చంపే లైసెన్సు జారీ చేయడం చట్టవిరుద్ధం, అనాగరికమని పేర్కొంది.

జిల్లాల ఇంచార్జి మంత్రులు వీరే

పవన్‌కల్యాణ్, లోకేశ్‌కు మినహాయింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అన్ని జిల్లాలకు ఇంచార్జి మంత్రులను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు మినహాయింపు ఇచ్చారు. నలుగురు మంత్రులకు రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. వీరంతా ఇకపై తమ సొంత జిల్లాలతో పాటు ఇంచార్జి జిల్లాలను కూడా పర్యవేక్షించాల్సి ఉంటుంది. కింజరాపు అచ్చెన్నాయుడుకు మన్యం జిల్లాతోపాటు అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. నిమ్మల రామానాయుడికి తూర్పు గోదావరి, కర్నూలు జిల్లాల బాధ్యతలు ఇచ్చారు. గొట్టిపాటి రవికుమార్‌కు పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల బాధ్యతలు అప్పగించారు. అనగాని సత్యప్రసాద్‌కు సత్యసాయి, తిరుపతి జిల్లాల బాధ్యతలు అప్పగించారు. విజయనగరం జిల్లాకు హోంమంత్రి వంగలపూడి అనితను, శ్రీకాకుళం జిల్లాకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను, విశాఖపట్నం జిల్లాకు బాలవీరాంజనేయస్వామిని, అల్లూరి సీతారామరాజు జిల్లాకు గుమ్మడి సంధ్యారాణిని, అనకాపల్లి జిల్లాకు కొల్లు రవీంద్రను, కాకినాడ జిల్లాకు పొంగూరు నారాయణను, ఎన్టీఆర్ జిల్లాకు సత్యకుమార్ యాదవ్‌ను, కృష్ణా జిల్లాకు వాసంశెట్టి సుభాశ్‌ను కేటాయించారు. గుంటూరు జిల్లాకు కందుల దుర్గేశ్‌ను, బాపట్ల జిల్లాకు కొలుసు పార్థసారథిని, ప్రకాశం జిల్లాకు ఆనం రామనారాయణరెడ్డిని, నెల్లూరు జిల్లాకు ఎండీ ఫరూఖ్‌ను, నంద్యాల జిల్లాకు పయ్యావుల కేశవ్‌ను కేటాయించారు. అనంతపురం జిల్లాకు టీజీ భరత్‌ను, కడప జిల్లాకు ఎస్.సవితను, అన్నమయ్య జిల్లాకు బీసీ జనార్దన్‌రెడ్డిని, ఏలూరు జిల్లాకు నాదెండ్ల మనోహర్‌ను, చిత్తూరు జిల్లాకు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నియమించారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా కారుణ్య నియామకాల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కరోనా మహమ్మారి, సహజ మరణాలు సంభవించిన దాదాపు 3 వేల ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాలకు చెందిన కారుణ్య నియామకాలు నిలిచిపోయాయని వివరించారు. ఆయా కుటుంబ సభ్యులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు. అర్హులకు వన్ టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలు కల్పించేలా ఈనెల 16న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో తీర్మానించాలని కోరారు. 12 వ పీఆర్సీ కమిషనర్ నియామకం, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లింపులు, సీపీఎస్ ఉపాధ్యాయులకు 11 నెలల మ్యాచింగ్ గ్రాంట్ అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేసేలా నిర్ణయించాలని కోరారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతలు ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అని, యువతకు మార్గదర్శి అని, జీవితాంతం దేశ ప్రతిష్ఠ కోసం తపించిన దేశభక్తుడని ప్రశంసించారు. అందరూ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆధునిక యుగంలో భారతదేశం ముందుండేలా కొత్త కొత్త ఆవిష్కరణలతో యువత అడుగులు వేసి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. దేశ ప్రతిష్ఠను ఆకాశంలో నిలబెట్టేలా శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత రక్షణ రంగం బలోపేతానికి విశేష కృషి చేసిన మిస్సైల్ మ్యాన్, మేధావి, నిరాడంబరుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు టీడీ జనార్ధన్, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, పార్టీ నేతలు, టీఎన్‌టీయూసీ నాయకులు గొట్టుముక్కల రఘురామరాజు, ములక సత్యవాణి, పర్చూరి కృష్ణ, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నబిడ్డలకు విషమిచ్చి చంపిన తల్లి

శ్రీకాకుళం జిల్లాలో దారుణ ఘటన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా): ఒక తల్లి కన్న కొడుకులకే విషమిచ్చి చంపిన దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటు చేసుకుంది. సంతబొమ్మాళి మండలం, మలగాం పంచాయతీ, కుముందాన వానిపేట గ్రామంలో జరిగిన ఈ ఘటన పరిసర ప్రాంతవాసులను కలచివేసింది. ఆ తల్లి కూడా ఆత్మహత్యకు ప్రయత్నించి ప్రాణాలతో బయటపడింది. పది, ఎనిమిది సంవత్సరాల చిన్నారులు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే... కుముంద వానిపేటకు చెందిన డెక్కల రాజుతో అదే గ్రామవాసి దుర్గకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి రుషి (10) బాలాజీ (8) ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరూ స్థానిక ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నారు. నాలుగు రోజుల క్రితమే ఆమె భర్త రాజు వంట పని చేసుకునేందుకు వేరే ప్రాంతంలోని హోటల్‌కు వెళ్లిపోయాడు. మంగళవారం గ్రామంలో దసరా పత్రి వారాలు కావడంతో దుర్గ సోదరుడు హరి తన ఇంటికి భోజనాలకు రావాలని అక్కను సోమవారం రాత్రి కోరాడు. దుర్గ ఉదయం వస్తానని చెప్పడంతో హరి తిరిగి వెళ్లిపోయాడు. ఉదయం తన అక్క ఇంకా రాకపోవడంతో ఇంటికి వెళ్లగా తలుపులు వేసి ఉండటంతో పక్కింటి వాళ్లను అడిగాడు. వాళ్లు వచ్చి తలుపులు గట్టిగా కొట్టడంతో దుర్గ తలుపులు తీసింది. అప్పటికే లోపల ఇద్దరు చిన్నారులు విగత జీవులుగా పడి ఉన్నారు. శీతల పానీయాలలో విషం కలిపి తాగడం వల్లే చిన్నారులు చనిపోగా, విషం తాగిన దుర్గ ప్రాణాలతో బయటపడింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టెక్కలి రూరల్ సర్కిల్ సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన దుర్గను కూడా ఆస్పత్రికి తరలించారు. తన భర్త సరిగా చూడకపోవడం వల్లే జీవితం మీద విరక్తి కలిగి ఇలాంటి దారుణానికి ఒడిగట్టానని పోలీసులకు దుర్గ తెలిపింది.

సినిమా టికెట్ ధరలు అనువుగా ఉండాలి

ఏపీ ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు గ్రంధి విశ్వనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు చిత్ర పరిశ్రమకు ఓటీటీతో పాటు సినిమా టికెట్ ధరల విషయం లోనూ ఇబ్బందులు ఉన్నాయి. సినిమా టికెట్ ధరల విషయంలో అనువైన విధానం తీసుకురావాలి. ఈ విధానం ఇతర రాష్ట్రాల్లో కూడా అమలులో ఉంది. ఈ అంశాన్ని పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆంధ్ర ప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు, పూర్ణా పిక్చర్స్ ఎండీ గ్రంధి విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పవన్ కల్యాణ్‌తో విశ్వనాథ్ భేటీ అయ్యి పూర్ణా పిక్చర్స్ శత వసంతాల సావనీర్ ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రంధి విశ్వనాథ్ మాట్లాడుతూ 'ఓటీటీలు మాత్రమే కాదు. సినిమా టికెట్ ధరలు ఎక్కువ ఉండటం కూడా సమంజసంగా లేదనే భావన కూడా పేద ప్రజలను సినిమాకు దూరం చేస్తోంది. సినిమా రంగాన్ని బతికించడానికి అనువైన రేట్ల విధానం తీసుకొస్తే బాగుంటుంది. దీనిపై ఆలోచన చేయాలి. తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక సహా ఇతర రాష్ట్రాల్లో ఈ విధానం అమల్లో ఉంది. కనిష్ఠ, గరిష్ఠ రేట్లను ప్రకటిస్తే సినిమా స్థాయిని బట్టి అనువైన రేట్ల విధానంలో ధరలు నిర్ణయించుకుంటారు. చిన్న సినిమాలకు ఈ విధానం వల్ల మంచి కలుగుతుంది. ప్రేక్షకులు కూడా సినిమా హాల్‌కు వస్తారు. దీని వల్ల అన్ని స్థాయిల చిత్రాలకు మేలు కలుగుతుంది' అని వివరించారు. ఈ సూచనలపై పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించి ఈ వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని తెలిపారు.

వైభవంగా సిరిమానోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం విజయనగరంలో వైభవంగా జరిగింది. సంప్రదాయానుసారం పాలధార, తెల్ల ఏనుగు, అంజలిరథం, బెస్తవారి వల ముందు నడవగా అమ్మవారి సిరిమాను ముమ్మార్లు పురవీధుల్లో ఊరేగింది. సిరిమాను రూపంలో పైడితల్లి అమ్మవారు తన పుట్టినిల్లు అయిన కోట వద్దకు వెళ్లి రాజ కుటుంబాన్ని, ఉత్సవానికి హాజరైన అశేష జనవాహినిని ఆశీర్వదించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకట్రావు అమ్మవారికి ప్రతిరూపంగా సిరిమాను అధిరోహించి భక్తులకు ఆశీస్సులు అందించారు. సిరిమాను రథం నడక మంగళవారం మధ్యాహ్నం 3.43 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 5.30 గంటలకు ముగిసింది. లక్షలాదిమంది భక్తులు తిలకించి పరవశించిపోయారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సిరిమాను రథం వెంట ఉండి ఆద్యంతమూ నడిపించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ..,ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలు ఇస్తూ, ఉత్సవాన్ని సకాలంలో పూర్తి చేశారు. సిరిమానోత్సవాన్ని పూసపాటి వంశీయులు, పైడితల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, సుధా గజపతి, ఊర్మిళ గజపతి, ఇతర రాజ కుటుంబీకులు ఎప్పటిలాగే కోట బురుజు పైనుంచి తిలకించారు. వీరితోపాటు మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, ఆర్.రఘురామకృష్ణరాజు వీక్షించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఉత్సవాన్ని తిలకించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే వినతుల స్వీకరణ

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేద ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని... వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకే ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొది లేసిందని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గొట్టుముక్కల రఘురామ కృష్ణరాజు, దేవినేని చందుతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పెడనకు చెందిన మామిడి సత్యనారాయణ అనే వ్యక్తి తన గోడును నేతల వద్ద వెళ్లబోసుకున్నాడు. మాజీ మంత్రి జోగి రమేశ్ అండతో హింసించి చంపుతామని బెదిరించి సంతకాలు చేయించుకుని ఆస్తిని కబ్జా చేశారని, దీనిపై గతంలో పెడన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీనిపై తమకు న్యాయం చేయాలని ఆయన వినతి పత్రం అందించాడు. చిలకలూరిపేట శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల పేరుతో జరిగిన నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని మరొకరు వినతి పత్రం అందించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికను బలవంతంగా ఏకగ్రీవం చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరు అయినా తమకు బిల్లులు మంజూరు చేయకుండా అడ్డుకున్నారని, ఇళ్ల బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని కర్నూలు జిల్లా ఆదోని మండలం దొడ్డనకేరి గ్రామ పంచాయతీ అధ్యక్షుడితో పాటు అనేక మంది బాధితులు అర్జీలు అందించారు. అలాగే కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తామని నేతలు వారికి హామీ ఇచ్చారు.

లడ్డూపై స్వతంత్ర విచారణ సభ్యులుగా త్రిపాఠి, గోపీనాథ్ జెట్టి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో కేంద్రం చేపట్టిన స్వతంత్ర విచారణలో రాష్ట్ర పోలీసుల జోక్యం ఉండదని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీం కోర్టు అనుమానించలేదన్నారు. ఈ వ్యవహారంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందన్నారు. సిట్ సభ్యులుగా సీనియర్ ఐపీఎస్ అధికారులు సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గోపీనాథ్ జెట్టి పేర్లను పంపినట్లు చెప్పారు. కాగా, టీడీపీ కేంద్ర కార్యాలయం, గన్నవరం పార్టీ కార్యాలయంపై దాడి కేసులతో పాటు మరో రెండు కేసులను కూడా సీఐడీకి బదిలీ చేసినట్లు డీజీపీ తెలిపారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై లుకౌట్ నోటీసు ఉందన్నారు. ఓ కేసులో గుంటూరు జిల్లా ఎస్పీ దీన్ని జారీ చేశారని వివరించారు.

విశాలాంధ్ర

సంపాదకీయం

వసంత ఒంటరి కాదు

గోకరకొండ నాగ సాయిబాబాను గత మార్చి ఏడున సర్వోత్తమ న్యాయస్థానం నిర్దోషిగా తేల్చింది. కానీ ఇన్నాళ్లు నిష్కారణంగా ఆయన జైలులో మగ్గిపోవడానికి కారణం ఏమిటో అన్వేషించలేదు. దానికి నివారణోపాయమూ ఎప్పటిలాగే సూచించలేదు. ఆ "నిర్దోషి" అంతకు ముందు పదేళ్లపాటు జైలు గోడల మధ్యే నలిగి పోవలసి వచ్చింది. తీరా విడుదలైన ఏడు నెలలలోపే ప్రాణాలు వదిలాడు. చక్రాల కుర్చీ ఖాళీ అయిపోయింది. విడుదలైన తరవాత ఆయన అనుభవించిన స్వేచ్ఛా జీవితం కొంత కాలం మాత్రమే. జైలు నుంచి విడుదలయ్యానన్న వాస్తవాన్ని ఆయన నమ్మలేక పోయారు. జైలు ఆవరణ వెలుపల వీచే గాలీ, ప్రసరించే వెలుతురు ఆయనను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించారన్న ఆరోపణపై కాలేజీలో పాఠం చెప్పి ఇంటికెళ్తున్న ప్రొఫెసర్ సాయి బాబాను మార్గ మధ్యమంలోనే పోలీసులు ఎత్తుకెళ్లి నాగపూర్ తీసుకెళ్లారు. అప్పటి నుంచి విడుదలయ్యే దాకా ఆయనకు జైలే నివాసమైంది. మధ్యలో అప్పుడప్పుడు బెయిలు మంజూరైనా ఆ వైభోగం న్యాయస్థానాలు మంజూరు చేసినన్ని రోజులు కూడా లేకుండా చేశారు. మళ్లీ తీసుకెళ్లి జైల్లో పడేశారు. ఆయన తల్లి మరణ శయ్యపై ఉన్నప్పుడూ, తీరా ఆమె మృతి తరవాత కూడా ఆయనకు పెరోల్ మంజూరు చేసేపాటి సాహసం ఈ దేశంలోని న్యాయస్థానాలు చేయలేకపోయాయి. "నేను సన్యాసిని, ఎప్పుడు కావాలంటే అప్పుడు జోలె బుజాన వేసుకుని పోతాను" అని నిఖార్సైన అబద్ధం ఆడగల పాలకులు ఉన్న చోట మాతృప్రేమ గురించి న్యాయస్థానాలు మాత్రం ఎలా ఆలోచించగలుగుతాయి. ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తడానికి అలవాటు పడిన న్యాయమూర్తులకు ఆ సాహసం ఎక్కడి నుంచి వస్తుంది. సాయిబాబాకు ప్రస్తుత వ్యవస్థ మీద అసంతృప్తి ఉండొచ్చు. దీన్నీ మార్చాలన్నా ఆకాంక్షా ఉండి ఉండొచ్చు. కానీ ఈ లక్ష్య సాధనకోసం ఆయన ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించాడన్న నిరాధార ఆరోపణను న్యాయస్థానాల్లో రుజువుచేసే సరంజామా పోలీసుల దగ్గర కూడా లేకుండా పోయింది. హింస ఉద్యమకారుల వృత్తి కాదు, తత్త్వం కాదు, అలవాటూ కాదు. లక్ష్యం అంతకన్నా కాదు. రాజ్య వ్యవస్థ హింసను అనివార్యం చేస్తున్న సందర్భాలు అడుగడుగునా కనిపిస్తాయి. వ్యక్తి చేసే హింస కన్నా రాజ్య హింస పరమ నికృష్టమైంది. కిరాతకమైంది. సాయిబాబా వీటికే బలయ్యారు. ఆయన జైలులో ఉండగా మరణించి ఉండకపోవచ్చు. కానీ జైలులో గడిపిన దుర్భర జీవితమే ఆయనను మృత్యువుకు చేరువ చేసింది. అయిదున్నరేళ్ల వయసులోనే పోలియోవల్ల ఆయన రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయి. జైలుకెళ్లక ముందు ఆయన తనంత తాను చక్రాల కుర్చీలో కూర్చోగలిగేవారు. తనంత తాను కాలకృత్యాలు తీర్చుకోగలిగే వారు. కాని దుర్భరమైన జైలు జీవితం ఇవేవీ సాధ్యం కాకుండా చేసింది. అరెస్టు చేసినప్పుడు పోలీసులు ఆయనను అమానుషంగా లాక్కెళ్లడంవల్ల ఆయన ఎడమచేయి పనిచేయకుండా పోయింది. జైలులో సరైన ఆరోగ్య సంరక్షణ లేనందువల్ల కుడిచేయి కూడా దెబ్బతిన్నది. ఆయనకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించాలని న్యాయమూర్తులు పెద్ద మనసుతో ఆదేశించినా అమలు చేయవలసిన ప్రభుత్వం, జైలు సిబ్బంది ఆ ఆదేశాలను కాలరాశారు. "ప్రాథమిక హక్కులు లేకుండా ప్రజాస్వామ్య హక్కులు సాధించుకోవడం సాధ్యం కాదు" అని సాయి బాబా అంటూ ఉండేవారు. ఈ మాట ఆయన విషయంలోనే రుజువైంది. భీమా కోరే గావ్ కేసులో అరెస్టయిన గిరిజన హక్కుల కోసం పోరాడిన స్టాన్ స్వామీ జైలులో మరణించలేదు. కానీ నిర్బంధంలో ఉండగానే అంటే బెయిలు మీద ఉన్నప్పుడు మరణించారు. సాయి బాబా నిర్దోషిగా విడుదలైన తరవాత మరణించినా దానికి ప్రధాన కారణం జైలులో ఆయన అనుభవించిన దుర్భర జీవితం, క్షోభే ప్రధాన కారణం. ఆయన విషయంలో న్యాయస్థానాలు న్యాయం చేయలేదు. చట్టాలూ ఆయనకు ఉపకరించలేదు. విడుదలైన తరవాత జైలు జీవిత ప్రభావంవల్లే ఆయన మృతి చెందారు. ఇది చట్ట పరిభాషలోనో, న్యాయ పరిభాషలోనే సహజ న్యాయం అంటారేమో తెలియదు. బెయిలు హక్కు అని విరామం లేకుండా చెప్పే అత్యున్నత న్యాయస్థానం ఆయన మీద రాజ్యం కొనసాగించిన కనికరంలేని దుర్వార్తనను ఆపలేకపోయింది. అలాంటప్పుడు బెయిలు హక్కు, జైలులో హింసా భరితమైన జీవనమే ప్రామాణికం, ఆనవాయితీ లేదా ప్రభుత్వ విధానం అనుకోవలసి వస్తుంది.

ఆయనకు ఒక సమయంలో బెయిలు మంజూరైన సందర్భంలో చట్టా రీత్యా ఆయన మీద తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఆయన మీద తమకు కోపం ఏమీ లేదనీ పోలీసులు నిండు న్యాయస్థానం కొలువులోనే ప్రకటించినప్పుడూ న్యాయస్థానాలు అంతిమ న్యాయానికి అడ్డేమిటో ఆలోచించలేదు. కింది కోర్టుల విచారణలో ఆయనకు ఎన్నడూ న్యాయం కలగలేదు. పై కోర్టులు తమ ముందుకు వచ్చిన పరిశీలానాంశాల పరిధి దాటి ఆలోచించలేదు. ఆయన మనోస్థైర్యాన్ని దెబ్బ తీయాలని జైలు అధికారులు సకలవిధ ప్రయత్నాలూ చేశారు. ఆయన బెసక లేదు. బెయిలు ఇవ్వాల్సివచ్చినప్పుడు పోలీసులు ఆయనను విడుదల చేసినా సమ్మతమే కానీ బయటకెళ్లి క్రియాశీల కార్యకర్తగా ఉండకూడదన్న షరతు పెట్టారు. దీన్ని ఆయన తృణీకరించారు. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఆంటోనియో గ్రాంసీని జైలులో పెట్టినప్పుడు నియంత ముస్సోలినీ ఇలాగే "ఆయన బుర్ర పని చేయకుండా చూడండి" అని ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం అంతకన్నా తక్కువ కిరాతకంగా ఏమీ లేదు. ఆయన వైకల్యాన్ని చూసి రాజ్య వ్యవస్థ ఎన్నడూ కనికరం చూపలేదు. ఇలాంటి శారీరక స్థితి గురించి ప్రజాస్వామ్యం ముసుగు తొడుక్కున్న ప్రభుత్వాలు మాత్రం ఏందుకు ఆలోచిస్తాయి? రాజ్యానికి ఉన్న అభ్యంతరమల్లా ఆయన ఆలోచనతోనే. తన ఆలోచనలను ఆచరణలో పెట్టే శారీరక శక్తి స్థాయి బాబాకు లేదు. ఆలోచనలను అదుపుచేసే శక్తి ఏ రాజ్య వ్యవస్థకూ ఉండదు. ఎలాంటి ఆలోచనలైనా చట్టవిరుద్ధమైనవి కావు. ఈ వాస్తవాన్ని రాజ్య వ్యవస్థ ఒప్పుకోదు. ఆలోచనలను, భావజాలాన్ని, భావధారను నియంత్రించగలమన్న భ్రమలోనే రాజ్య వ్యవస్థ ఉంటుంది. అది దాని స్వభావం. పౌరులు చేయగూడని పనులు చేసే హక్కు రాజ్యానికీ లేదు. కానీ అనునిత్యం జరిగేది అదే. పౌరుల విషయంలో చట్టబద్ధం కానివి రాజ్యానికి పాలనా తంత్రంలో భాగం అవుతున్నాయి. ఈ అన్యాయాన్ని ఎవరు నివారించాలి. కోర్టులకు ఆ అధికారం ఉన్నా అవీ తప్పించుకుంటున్నాయి. ప్రవచనాలకే పరిమితం అవుతున్నాయి. జైలులో సాయిబాబాకు కష్టాలే మిగిలాయి. ఆ కష్టాల ప్రభావం చివరకు ఆయన ప్రాణాలు తీసింది. ఈ పరిస్థితి ఎదురుకావడమే మహా విషాదం. న్యాయం కోసం, పౌర హక్కులకోసం, ప్రజాస్వామ్యం కోసం ప్రాణాలు అర్పించిన వారిలో చేరిపోయిన మరో పేరు సాయిబాబా. ఈ పేరు చాలా కాలం మన చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. జైలులో సాయిబాబా పడ్డ కష్టాలకు ఆయన భార్య వసంత మోసిన భారం, కార్చిన కన్నీళ్లు, నిలబెట్టుకున్న ధైర్యం, కూడదీసుకున్న ఆత్మవిశ్వాసం ఏ మాత్రం తక్కువ కాదు. ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. అందుకే వసంత ఒంటరి కాదు.

లెబనాన్‌పై దొంగదెబ్బ తీసిన ఇజ్రాయిల్

సైన్యం, రాజకీయ నాయకుల లక్ష్యంగా తాము దాడులు జరిపామని సాకుచెప్పి ఇజ్రాయిల్ లెబనాన్‌లో దాదాపు 2000మందికిపైగా పౌరులను ఇంతవరకు హతమార్చింది. వందలాది మంది పౌరులు గాయపడ్డారు. సెప్టెంబరు 20వ తేదీ నుంచి ఇంతవరకు ఇజ్రాయిల్ ఇదే పన్నాగం పన్నుతోంది. 20వ తేదీనుంచే లెబనాన్‌పైన ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించింది. మొదటిరోజు బీరుట్ దక్షిణ పొలిమేరల్లో రెండు భవనాలపైన దాడులుచేసి వాటిని ధ్వంసం చేసింది. 20మంది పౌరులను అంతక్రితమే హతమార్చిన ఇజ్రాయిల్ ఈ దాడిలో 54మందిని చంపివేసింది. 60 మంది గాయపడ్డారు. హెజ్బొల్లా నాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులను చేశామని బుకాయించింది. సెప్టెంబరు 23న హేమడి ప్రాంతంలో నివాసభవనంపైన హెజ్బొల్లా నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడిచేసింది. ఇందులో 6గురు తీవ్రంగా గాయపడ్డారు. 24 వ తేదీ బీరుట్‌లోని ఘోడెయిరీ ప్రాంతంలో దాడిచేసి 6గురు పౌరులను హతమార్చింది. 25వ తేదీ జరిపిన దాడిలో మరో 6 గురు పౌరులు చనిపోగా 15మంది గాయపడ్డారు. బీరుట్ దక్షిణ సరిహద్దుల్లోని అల్‌ఖైమ్ ప్రాంతంలో సెప్టెంబరు 26 న హెజ్బొల్లా నాయకుడిని చంపివేశామని ఇజ్రాయిల్ ప్రకటించింది. వారంలోపు 4సార్లు దాడులు చేసింది. నాలుగోసారి అత్యధికులు జీవించే ప్రాంతంలో దాడిచేయగా, ఇద్దరు పౌరులు చనిపోగా, 15మంది గాయపడ్డారు. సెప్టెంబరు 27న హెజ్బొల్లా ప్రధాన కార్యాలయాలపై బాంబులతో 3నిమిషాల్లో పదిసార్లు దాడులు చేసింది. హరెట్,హరిక్‌ప్రాంతంలో ఏడు నివాస భవనాలపైన దాడి జరిపి ధ్వంసం చేసింది. హెజ్బొల్లా ప్రధాన కార్యదర్శిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపింది. బాగ్రాన్ పట్టణంపైన అదే రోజు హెజ్బొల్లా పార్టీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. ఈ దాడిలో 8మందిపౌరులు మృతి చెందారని ముగ్గురు గాయపడ్డారని ఇజ్రాయిల్ వెల్లడించింది. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 8 వ తేదీ వరకు జరిగిన దాడుల్లో 16,040 మందిమృతి చెందగా, వారిలో 104మంది పిల్లలు, 194 మంది మహిళలు ఉన్నారు. 8408 మంది గాయపడ్డారు. సెప్టెంబరు 29న డెకా ఉత్తరప్రాంత లోయలో జెబౌడ్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం ఒక భవనంపై జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన17మంది మరణించారు. హిడాన్‌లోని అయిన్ అల్ఫ్ డెల్ఫ్ ప్రాంతంలో ఒక భవనాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో 71మంది చనిపోగా, వందమందికిపైగా గాయపడ్డారు.

సైన్యంపై దాడిచేస్తున్నామని సాకుచెప్పి అక్టోబరు 1 వ తేదీనుంచి పౌరులపైన దాడులుచేసింది. అక్టోబరు 1న అయిన్ అల్ హిల్ వెహ్ క్యాంపుపై దాడి చేసి అల్-అక్సా మార్టిస్ బ్రిగేడ్స్ నాయకుడిని చంపాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ దాడుల్లో ఇద్దరు మహిళలు, ముగ్గురు పిల్లలతో సహా ఆరుగురు మృతిచెందారు. అక్టోబరు3న హెజ్బొల్లా సభ్యుల పేర్లు చెప్పి అల్-బచపురా ప్రాంతంలో దాడి జరిపింది. ఈ దాడుల్లో ఇస్లామిక్ హెల్త్ అథారిటీకి చెందిన 7గురు పారామెడికల్ సిబ్బందిని హతమార్చారు. అక్టోబరు4న బెద్దావి క్యాంపులో హసన్ బ్రిగేడ్స్ నాయకుడిని హతమార్చారు. ఈ దాడిలో ఆయన భార్య ఇద్దరు కుమార్తులు కూడా మృతిచెందారు. అక్టోబరు 5న ఖరోబ్ ప్రాంతంలో జియేహెలో ఒక నివాస భవనంపై దాడిచేయగా ఇద్దరు పౌరులు చనిపోయారు. 18మంది గాయపడ్డారు. అదే రోజు ఖయమతి యేహ్ పట్టణంలో రెండు నివాస భవనాలపైన దాడిజరిపి ముగ్గురు పిల్లలతో సహా ఆరుగురిని హతమార్చారు.

అలేయ్ జిల్లాలో కైఫన్ పట్టణంలో జరిపిన దాడిలో 6గురు చనిపోగా 13మంది గాయపడ్డారు. 9వ తేదీన ఛౌఫ్ జిల్లాలోని వార్గేనియా పట్టణంలో సైన్యం ఒక షెల్టర్‌పై దాడి చేసింది. ఈ షెల్టర్‌లో 15మంది తలదాచుకుంటున్నారు. వీరిలో 6గురు మృతిచెందారు. అక్టోబరు 10న జఫ్రీ జిల్లాలోని కరక్ ఏరియాలో నివాసభవనంపైన జరిపినదాడిలో 9మంది మృతిచెందగా, 14మంది గాయపడ్డారు. ముందుగా హెచ్చరికలు లేకుండానే ఈ దాడులన్నీ జరుగుతున్నాయి. అదే రోజు బీరుట్‌లోని రెండు ప్రాంతాల్లో దాడులు జరపగా అక్కడి ప్రజలు సురక్షితంగానే ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రిసెషన్ ఆయుధాలతో జరిపిన దాడిలో కనీసం 22మంది మరణించగా, 117మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా పౌరులను హతమారుస్తున్నది. కనీసం హెచ్చరికలు కూడా లేకుండా పౌరనివాస ప్రాంతాల్లోనే దాడులుచేస్తూ సైన్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బుకాయిస్తోంది.

లక్ష్యం నెరవేర్చని ఆర్టీఐ చట్టం

శైలేశ్ గాంధీ

కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) చేశారు. ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న వామపక్షాల వత్తిడితో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వంలో ప్రధానమంత్రితో సహా మంత్రులు, ఆయా శాఖలలో జరిగే అవతవకలను, అక్రమాలను ప్రశ్నించి వాస్తవ అంశాలను తెలుసుకునేందుకు ఈ చట్టాన్ని చేశారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ చట్టాన్ని నిర్వీర్యం చేశారు. అనేకమంది జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు వాస్తవ అంశాలను తెలుసుకునేందుకు దరఖాస్తు చేసినప్పటికీ తగిన సమాధానాలు ఇవ్వకుండా తిరస్కరిస్తున్న పరిస్థితి ఉంది.

ఆర్‌టీఐ చట్టాన్ని తీసుకువచ్చి 19 సంవత్సరాలు అవుతుంది. 2024అక్టోరు 12తో 12 సంవత్సరాలు పూర్తయింది. ప్రభుత్వ పారదర్శకత, జవాబుదారీ తనాన్ని ధృవీకరించుకునేందుకు మొట్టమొదట ఈ చట్టాన్ని ఎంతో ఉత్సాహంతో తీసుకువచ్చారు. ప్రభుత్వంనుంచి తమకు అవసరమైన విషయాలు తెలుసుకోవచ్చుననేదే ఈ చట్టం వల్ల ప్రధానంగా ఆశించింది. ఈ సుదీర్ఘకాలంలో కొన్ని విషయాలలో మాత్రమే లక్ష్యం నెరవేరింది. అత్యధిక అంశాలలో దరఖాస్తులు చేసుకున్నవారు నిరాశ చెందడమేకానీ అసలు లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచంలో ఇండియా అతి పెద్ద ప్రజాస్వామ్యదేశమని చెప్పుకుంటున్నాం. అయితే ఇది సంక్షేమం, మంచి పరిపాలన ఉన్నదేశంగా సామాన్యపౌరులు పరిగణించడంలేదు. ప్రజాస్వామ్యం ప్రజలకోసం ప్రజలచే పాలించేదిగా ఉండాలి. నిజం తెలుసుకునేందుకు సామాన్యప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే వారు తీవ్రంగా బాధపడవలసిందే. హింసకు గురికావలసివస్తోంది. నేటి బీజేపీ ప్రభుత్వంలో ప్రభుత్వ యంత్రాంగం నిరంకుశంగానే వ్యవహరిస్తూ ఆర్‌టీఐ చట్టం కింద వచ్చిన దరఖాస్తులను పట్టించుకోని సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి.

ఒక పౌరుడి సార్వభౌమత్వాన్ని గుర్తించేందుకు మొదటిసారిగా ఈ చట్టాన్ని తీసుకువచ్చారని ప్రజలు భావించారు. పౌరులకు ప్రభుత్వంనుంచి అవసరమైన సమాచారాన్ని తెలుసుకుని వాస్తవాన్ని గుర్తించడానికి ఆర్‌టీఐ దోహదం చేస్తుంది. అవినీతిని బైటపెట్టేందుకు తమకు ఎదురవుతున్న సమస్యలను తీర్చుకునేందుకు ఆర్‌టీఐ చట్టం పౌరులకు అధికారాన్ని ఇస్తుంది. పౌరులకు అందుబాటులో ఉండే సమాచారం జాబితా ఆర్‌టీఐ చట్టం వద్ద ఉండదు. అంతేకాదు, ప్రతికూల సమాచార జాబితా కొంత ఉంటుంది. దీని ద్వారా సమాచారాన్ని పౌరుడికి తిరస్కరిస్తున్నారు. అయితే అవసరమైన సమాచారాన్నంతటినీ పౌరులు తెలుసుకునేందుకు అవకాశం ఉండాలి.

ప్రపంచంలోనే ఉత్తమమైన పారదర్శక చట్టాలలో ఇది అత్యుత్తమమైనది. అయితే చట్టం ద్వారా వాగ్దానం చేసిన ఫలితాలు రావడంలేదు. మేలైన ప్రభుత్వంకోసమే ఈ చట్టాలు చేశారు. చట్టం

ద్వారా లక్ష్యాలను నెరవేర్చుకోవడంలో వైఫల్యాలు ఎక్కువగా ఉన్నాయి. కోరినవెంటనే చట్టంలోఉన్న బాధ్యతమేరకు ఉన్నటువంటి సమాచారాన్ని పౌరుడికి ఇవ్వాలి. ఒకవేళ 30రోజులలో తగిన కారణంలేకుండా సమాచారాన్ని ఇవ్వడానికి తిరస్కరించినట్లయితే సంబంధిత అధికారికి జరిమానా విధించవలసి వస్తుంది. సమాచారంకోసం వెళ్లిన పౌరులు అసంతృప్తి చెందితే ప్రభుత్వ శాఖలను సీనియర్ అధికారికి విజ్ఞప్తి చేసేందుకు చట్టం అవకాశం కల్పిస్తుంది. ఉన్నతాధికారి వద్ద కూడా సంతృప్తికరమైన సమాధానం లేకపోతే చట్టం రెండవ అప్పిలేట్ అథారిటీని అంటే సమాచార కమిషన్‌ను సంప్రదించవచ్చు. కమిషన్‌లు తగిన ఉత్తర్వులను అమలు చేసేందుకు తగిన అధికారాన్ని చట్టం ఇస్తుంది.

ప్రధానమంత్రి, ప్రతిపక్షనాయకుడు మరో మంత్రితో కూడిన కమిటీ సెంట్రల్ కమిషన్ సమాచార కమిషనర్లను ఎంపిక చేస్తుంది. అలాగే రాష్ట్రాలలో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, మరో మంత్రితో కూడిన కమిటీ రాష్ట్ర కమిషన్లను ఏర్పాటు చేస్తుంది. ఇదంతా ఆర్‌టీఐ చట్టానికి ఉన్న అనుసంధానాన్ని బలహీనపరచింది. కమిషనర్లను ఏమాత్రం పారదర్శకత లేకుండా ఎంపిక చేస్తున్నారు. నిరంకుశ అధికారులు, రాజకీయ పలుకుబడి కలిగినవారు కమిషనర్లను ఎంపిక చేస్తున్నారు. ఫలితంగా దరఖాస్తుదారులు తగిన సమాచారాన్ని పొందలేకపోతున్నారు. ఎంపికచేసిన అత్యధిక కమిషనర్లకు పారదర్శకంగా, చట్టాన్ని చిత్తశుద్ధితో అమలుచేయాలని భావించడంలేదు. తమకు అనుకూలమైనవారికి మాత్రమే తగిన సమాచారం ఇవ్వడం జరుగుతోంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం, సమాచారాన్ని పొందే ప్రాథమిక హక్కు పౌరుడికి ఉంటుంది. అయితే దీని ప్రాధాన్యతను అర్థంచేసుకోవడం లేదా గుర్తించడం జరగడంలేదు. కమిషనర్లు చివరకు కోర్టులు దరఖాస్తుదారులు సమాచారాన్ని ఎందుకు తెలుసుకుంటున్నారో కారణాలు చెప్పాలని కోరుతున్నారు. దరఖాస్తుదారులు చెప్పే జవాబులు వారికి సంతృప్తి కలగకపోతే సమాచారం ఇవ్వడంలేదు. దేశంలోని అనేకమంది కమిషనర్లు ఏమాత్రం శ్రద్ధ, చిత్తశుద్ధి లేకుండా ఉన్నారు. ఇది పౌరులకు మరిన్ని ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అనేకమంది కమిషనర్లు వారంలో కనీసం 40 గంటలు కూడా పనిచేయడంలేదు. ఎక్కువ కేసులలో దరఖాస్తులు తిరస్కరించడం ఏమాత్రం అంగీకరించదగిందికాదు. నెలకు 50 నుంచి 100 వరకు కేసులను మాత్రమే అనేకమంది కమిషనర్లు

> **అవినీతిని బైటపెట్టేందుకు తమకు ఎదురవుతున్న సమస్యలను తీర్చుకునేందుకు ఆర్‌టీఐ చట్టం పౌరులకు అధికారాన్ని ఇస్తుంది. పౌరులకు అందుబాటులో ఉండే సమాచారం జాబితా ఆర్‌టీఐ చట్టం వద్ద ఉండదు. అంతేకాదు, ప్రతికూల సమాచార జాబితా కొంత ఉంటుంది. దీని ద్వారా సమాచారాన్ని పౌరుడికి తిరస్కరిస్తున్నారు. అయితే అవసరమైన సమాచారాన్నంతటినీ పౌరులు తెలుసుకునేందుకు అవకాశం ఉండాలి. ప్రపంచంలోనే ఉత్తమమైన పారదర్శక చట్టాలలో ఇది అత్యుత్తమమైనది. అయితే చట్టం ద్వారా వాగ్దానం చేసిన ఫలితాలు రావడంలేదు.**

పరిష్కరిస్తున్నారు. అదే సమయంలో నెలలో 400నుంచి 500 కేసులవరకు పరిష్కరించడంలేదు. దేశంలోని హైకోర్టులలో కేసులు పరిష్కరించే వ్యవహారం మరింత సంక్లిష్టంగా ఉంటోంది. నెలకు 200కేసులకుపైగా నిలిచిపోతున్నాయి.

కమిషనర్ల వద్ద నిలిచిపోయే కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. వారు పరిష్కరించే కేసులు 6నెలల నుంచి 4సంవత్సరాలవరకు ఆగిపోతున్నాయి. పౌరులు తమకు కావలసిన సమాచారాన్ని తెలుసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. చట్టంలో పొందుపరచినమేరకు విధులను చట్టం, ప్రభుత్వ అధికారులు నెరవేర్చడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఫలితంగా పౌరులు చట్టంపై విశ్వాసం కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత గోప్యతను నిర్వచించడం పార్లమెంటు చట్టంలోని సెక్షన్ మరింత నైపుణ్యంగా రూపొందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సామాన్యులను పట్టించుకోని మోదీ

జ్ఞాన పాథక్

దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ ఎగబాకుతోంది. ఈ సంవత్సరంలో ఇంతకుముందులేని విధంగా సెప్టెంబర్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) అత్యధికంగా 5.49 శాతానికి పెరిగింది. ఆగస్టులో 3.65 శాతంగా నమోదైన రిటైల్ ద్రవ్యోల్బణం బియ్యం, వంటనూనెలు, కూరగాయలు, ఉల్లిపాయలు, వెల్లులిపాయలు, ఇతర నిత్యావసరాల ధరలు పెరగడంతో సెప్టెంబరులో 5.49 శాతానికి చేరింది. ఇది తొమ్మిది నెలల గరిష్ఠం. 2023 డిసెంబరులో నమోదైన 5.69శాతం తర్వాత ద్రవ్యోల్బణం అత్యధికంగా నమోదుకావడం ఇదే. గత ఏడాది సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 5.02 శాతంగా ఉంది. ఏడాది వ్యవధిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 6.62 నుంచి 9.24 శాతానికి పెరిగింది. సెప్టెంబరులో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 1.84 శాతానికి పెరిగింది. ఆగస్టులో ఇది 1.31శాతంగా నమోదైంది. గత సంవత్సరం సెప్టెంబరులో -0.07 శాతంగా ఉంది. ఆహార పదార్థాల టోకు ద్రవ్యోల్బణం 3.11% నుంచి గణనీయంగా పెరిగి 11.53 శాతానికి చేరింది. కూరగాయల ద్రవ్యోల్బణం రేటు -10.01% నుంచి 48.73 శాతంగా నమోదైంది. ధరల భారం నుంచి దేశ ప్రజలను కాపాడేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్నది శూన్యం. ఎన్డీయే ప్రభుత్వ విధానాల కారణంగా దేశంలో పట్టెడన్నం కోసం పేదల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ప్రపంచ ఆకలి సూచిక (జీహెచ్ఐ)లో మన స్థానం నానాటికీ దిగజారిపోతోంది. పొరుగు దేశాల కంటే చాలా ఘోరంగా ఉంది. 2024వ సంవత్సరానికి సంబంధించి విడుదలైన 19వ జీహెచ్ఐలో భారత్ 105వ స్థానంలో (మొత్తం 127 దేశాలు) నిలిచింది. పొరుగున ఉన్న నేపాల్, శ్రీలంక, మైన్మార్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కంటే భారత్ వెనుకబడిపోవటం తీవ్ర దిగ్భ్రాంతికరం. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అత్యవసర మందుల ధరలు పెంచడం కూడా దేశంలో ధరల పెరుగుదలకు ఒక కారణంగా చెప్పవచ్చు. మందులు, ఆహార ధరల పెరుగుదల సామాన్య, మధ్య తరగతి ప్రజానీకాన్ని ముందెన్నడూలేని విధంగా అతలాకుతలం చేస్తోంది. ఈ సమయంలో ప్రజలకు కావాల్సింది మతపరమైన ఊరడింపు కాదు, వాస్తవానికి వారికి కావాల్సింది

ఔషధం, ఆహారం లభ్యత, కొనుగోలు స్థోమత, కానీ ఈ రెండూ కూడా వారికి అందని లక్ష్యాలుగా మారుతున్నాయి.

జులై, 2022 - జూన్, 2023 మధ్య కాలానికి నేషనల్ శాంపిల్ సర్వే 79వ రౌండ్‌లో కొంత భాగం ఇటీవల విడుదలైంది, ఇది జనాభాలో 18 శాతం కంటే ఎక్కువ మంది రుణగ్రస్తుల స్థాయిని గుర్తించింది, ప్రస్తుత స్థాయిలో రుణ వ్యయాన్ని తట్టుకోలేకపోతున్నారని తెలిపింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2024 ప్రకారం, జనాభాలో 13.7 శాతం మంది పోషకాహార లోపంతో ఉన్నారు, ఐదేళ్లలోపు పిల్లలలో 35.5 శాతం మంది ఆకలితో అల్లాడుతున్నారు, 18.7 శాతం మంది ఆకలితో ప్రాణాలు కోల్పోతున్నారు. 2.9 శాతం మంది పిల్లలు పుట్టిన ఐదు రోజులలోపే మృతిచెందుతున్నారు. పిల్లల మరణాల విషయంలో మన దేశంలో 2000వ సంవత్సరం నుంచి కొంత మెరుగుదల కన్పిస్తోంది. అయినప్పటికీ పోషకాహార లోపం తీవ్రమైన సమస్యగానే మిగిలిపోతోంది. అలాగే ఐదు సంవత్సరాల లోపు చిన్నారులలో కుంగుబాటు, ఎత్తుకు తగిన బరువు లేకపోవడం అనే సమస్యలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ సూచికలు తీవ్రమైన ప్రజారోగ్య సవాళ్లకు దారితీస్తున్నాయని నివేదిక తెలిపింది. ప్రపంచ దేశాలలో ఆకలిని తగ్గించే విషయంలో 2016 నుంచి పురోగతి లేదని నివేదిక ప్రస్తావించింది. ఈ పరిస్థితులలో 2030 నాటికి ఆకలిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాకపోవచ్చునని స్పష్టం చేసింది. ఆకలిపై 127 దేశాలలో అధ్యయనం జరపగా 42 దేశాలు నేటికీ 'తీవ్రత' లేదా 'ఆందోళనకరం' స్థాయిలోనే ఉన్నాయని తెలిపింది. ఆకలి, వాతావరణ మార్పులు, లింగ అసమానత్వం ఈ మూడింటి మధ్య నేరుగా సంబంధం ఉన్నదని నివేదిక ఎత్తిచూపింది. వివక్షాపూరితమైన నిబంధనలు, లింగ ఆధారిత హింస అనేవి మహిళలను, మైనారిటీలను ప్రమాదంలో పడేస్తున్నాయని, వారికి ఆహార, పోషకాహార భద్రత లభించడం లేదని తెలియజేసింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలకు వాతావరణ మార్పుల ప్రభావం ప్రతిబంధకంగా ఉంటోందని నివేదిక చెప్పింది.

ధరల పెరుగుదలను అడ్డుకోవాలనీ, నిత్యావసర వస్తువుల ధరలు తమకు అందుబాటులో ఉండేలా చూడాలన్న సామాన్య ప్రజల అభ్యర్థనలు ప్రధానమంత్రి మోదీ చెవిని తాకడంలేదు. ప్రజల డిమాండ్‌కు వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తోంది. మార్కెట్లో లాభాలు గడిస్తున్న వారు నిత్యావసర వస్తువుల ధరలు, ధరల నియంత్రణ యంత్రాంగం క్రిందకు వచ్చే మందుల ధరలు సైతం పెంచుతూనే ఉన్నారు. కొన్ని సరుకులు, సేవల ధరలను నియంత్రిస్తున్నప్పటికీ భారత్‌లో ఒక ధరల విధానం లేకపోవడం గమనార్హం. మోదీ ప్రభుత్వం ధరల నియంత్రణ యంత్రాంగాన్ని ఎలా నిర్వహిస్తుందో వేచిచూడాలి. ధరలు అదుపులో ఉంచాలన్న ప్రజల డిమాండ్‌ను పెడచెవినపెట్టి ధరల పెరుగుదలను కోరుకునే వారి మాటను మోదీ ప్రభుత్వం వినడం అత్యంత విచారకరం. ధరల అదుపులో మోదీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రతి ఇంటి వంటగది, ప్రతి ఆహార దుకాణం వంటనూనెల ధర పెరుగుదల ప్రభావాన్ని చవిచూసింది. కనీసం ఈ పండుగ సీజన్‌లోనైనా వంట నూనెల ధరలు పెంచవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాపారులను వేడుకోవడం యావత్ దేశాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. దేశంలో 30లక్షల టన్నుల వంట నూనె నిల్వ ఉన్నప్పటికీ, దిగుమతులు లేనప్పటికీ ధరలు పెంచవద్దని వ్యాపారులను కేంద్ర ఆర్థిక మంత్రి అభ్యర్థించడం ఆమె నిస్సహాయతను చాటుతోంది. వంటనూనె ధరల మంటల నుంచి ఈ దేశాన్ని, దేశ ప్రజలను రక్షించే పేరుతో అనేక వక్రీకరణలతో కేంద్రం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచింది. దేశీయ మార్కెట్లో వంటనూనెల ధరలు మరింత సలసలకాగడానికి ఈ చర్య దోహదపడింది తప్ప ధరల మంటతో అల్లాడుతున్న ప్రజలకు ఏ మాత్రం ఊరటకలిగించలేదు. మోదీ ప్రభుత్వ విధానాలు వ్యాపారం పరిశ్రమల వారి ప్రయోజనాలకు, లాభదాయకతకు ఉపయోగపడతాయి తప్ప సామాన్య ప్రజలకు కాదనడంలో ఎటువంటి అనుమానంలేదు.

ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు: టాటా గ్రూప్

న్యూదిల్లీ: రాబోయే ఐదేళ్లలో తయారీ రంగంలో టాటా గ్రూపు ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించబోతోందని ఆ గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. సెమీ కండక్టర్, ఎలక్ట్రిక్ వెహికల్, బ్యాటరీ, సంబంధిత రంగాల్లో ఈ ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సదస్సులో మంగళవారం ఆయన మాట్లాడారు. తయారీరంగంలో పెద్దఎత్తున ఉద్యోగ సృష్టి జరగకుండా అభివృద్ధి చెందిన దేశంగా మారడం అంత సులువు కాదని చెప్పారు. సెమీ కండక్టర్, ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్, అసెంబ్లీ, ఎలక్ట్రిక్ వెహికల్, బ్యాటరీలు, సంబంధిత రంగాల్లో టాటా గ్రూపు రాబోయే ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించబోతోందని చంద్రశేఖరన్ అన్నారు. అసోంలోని సెమీ కండక్టర్ ప్లాంట్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలకు సంబంధించి కొన్ని ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల వల్ల పర్యావరణ వ్యవస్థలో మరిన్ని చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయని చెప్పారు. తయారీ రంగంలో ఈ స్థాయిలో ఉద్యోగాల కల్పన జరగాలంటే ప్రభుత్వ సహకా రం అవసరమని పేర్కొన్నారు. సెమీ కండక్టర్ వంటి తయారీ రంగాల్లో వచ్చే ప్రతీ ఉద్యోగానికి పరోక్షంగా 8-10 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చంద్రశేఖరన్ అన్నారు.

90 ఏళ్లు వచ్చినా రాష్ట్రం కోసం శ్రమిస్తా

'84 ఏళ్లు' ప్లకార్డులపై స్పందించిన శరద్‌పవార్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రధాన పార్టీలన్నీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా ఏర్పాటుచేసిన సభలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పాల్గొన్నారు. తాను ప్రసంగిస్తున్న సమయంలో సభలో కొందరు యువకులు '84 ఏళ్లు' అని ప్లకార్డులు చూపడంపై ఆయన స్పందించారు. 'నా ఫొటో కింద 84 ఏళ్లు అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకొని కొందరు యువకులు నిలబడి ఉన్నారు. మీరేమీ బాధ పడకండి. మనది సుదీర్ఘ ప్రయాణం. మహారాష్ట్రను సరైన మార్గంలో నడిపేవరకు ఈ వృద్ధుడు ఆగిపోడు. 84 ఏళ్లు వచ్చినా... 90 ఏళ్లు నిండినా రాష్ట్రం కోసం శ్రమిస్తూనే ఉంటాను. అప్పటివరకు విశ్రమించేది లేదు. నా ప్రయాణం కొనసాగిస్తూనే ఉంటా' అని పవార్ వ్యాఖ్యానించారు. సీట్ల సర్దుబాటు విషయంలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో విభేదాలు వచ్చాయంటూ వచ్చిన ఊహాగానాలపై ఆయన స్పందించారు. తమ కూటమిపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు.

నా పరువు తీయొద్దు

రాజ్ కుంద్రా

ముంబై: తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రా చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. నటి రియా బర్డేకు సంబంధించిన అక్రమ వలస కేసుతో ముడిపెడుతూ ఓ వార్తా కథనం, యూట్యూబ్ ఛానెల్‌లో తన పరువుకు భంగం వాటిల్లేలా రాతలు రాసిన వారిపై ముంబైలోని జుహు పోలీస్ స్టేషన్‌లో కేసుపెట్టారు. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'నేను ఈ ఫిర్యాదు చేయడానికి ఆ మీడియా కథనాలే కారణం. అనేక సందర్భాల్లో తప్పుడు, పరువుకు భంగం కలిగించే కథనాలు ప్రచురితం చేసి నా ప్రతిష్ఠను దెబ్బతీశారు. ఆ రాతలను వెనక్కి తీసుకునేందుకు అవకాశం ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. దీనిపై నేను న్యాయపోరాటం చేస్తున్నాను. మీడియా విచారణకు నేను బలికాను' అని కుంద్రా చెప్పారు. బంగ్లాదేశ్‌కు చెందిన శృంగార తార రియా బర్డే ఇటీవల మహారాష్ట్రలో అరెస్టయింది. నకిలీ పత్రాలు ఉపయోగించి భారత్‌లో అక్రమంగా నివసిస్తున్నందుకు ఆమెను అరెస్టు చేశారు.

జాతీయ ప్రయోజనాలు ముఖ్యం

- ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి
- భారత్-కెనడా వివాదంపై స్పందించిన విపక్షాలు
- ఏకపక్షధోరణి పనికిరాదని మోదీ సర్కారుకు హితవు
- అమిత్‌షా, దోవల్ రక్షణలో బిష్ణోయ్ ఉన్నారా: తృణమూల్

న్యూదిల్లీ: భారత్-కెనడా మధ్య సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో జాతి ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రప్రభుత్వం తమను విశ్వాసంలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కాగా ఈ అంశంపై తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని మోదీ సర్కారుపై విమర్శలు గుప్పించాయి. అత్యంత సున్నిత సమస్యపై మోదీ సర్కారు ఏకపక్ష చర్యలకు పోకుండా ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ సూచించారు. 'భారత్-కెనడా మధ్య సంబంధాలు క్షీణిస్తున్న అత్యంత సున్నిత సమస్యపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్ష నాయకులను, ఇతర రాజకీయ పార్టీల నాయకులను వెంటనే విశ్వాసంలోకి తీసుకుంటారని భారత జాతీయ కాంగ్రెస్ ఖచ్చితంగా ఆశిస్తోంది' అని జైరామ్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఈ విషయంలో భారతదేశ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ హిందీ్వ పేర్కొన్నారు. 'భారత విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైంది. శ్రీలంక, బంగ్లాదేశ్, చైనా, నేపాల్‌లతో భారత్ సంబంధాలు సరిగా లేవు. చైనా మన భూభాగాన్ని ఆక్రమించింది. దాని గురించి మీరు ఏమీ చేయలేరు' అని హిందీ్వ మోదీ సర్కారునుద్దేశించి పీటీఐతో అన్నారు. ఒకప్పుడు మిత్రదేశంగా ఉన్న నేపాల్ కూడా ఇప్పుడు భారత్‌కు దూరంగా మసలుతోందన్నారు.

"మోదీ ప్రభుత్వం లారెన్స్ బిష్ణోయ్‌తో కలిసి పనిచేస్తోందని కెనడా ఆరోపించింది. ముంబైలో లారెన్స్ బిష్ణోయ్ ఆదేశాల మేరకే మాజీ మంత్రి బాబా సిద్దిఖీని కాల్చిచంపారు. బిష్ణోయ్ గుజరాత్ జైలులో బంధించబడ్డాడా లేదా వారి పనిచేస్తున్నందున అమిత్ షా, అజిత్ దోవల్ రక్షణలో ఉన్నారా?" తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు సాకేత్ గోఖలే ప్రశ్నించారు. 'మోదీ ప్రభుత్వం లారెన్స్ బిష్ణోయ్‌తో కలిసి పనిచేస్తోందని కెనడా ఆరోపించింది. అదే నిజమైతే ఇది అత్యంత దిగ్భ్రాంతి కర విషయంగా భావించాల్సి ఉంటుంది' అని ప్రముఖ న్యాయవాది, హక్కుల కార్యకర్త ప్రశాంత్ భూషణ్ అన్నారు. గత కొన్నేళ్లుగా మునుపెన్నడూ జరగనివి జరుగుతున్నాయంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, తృణమూల్ మాజీ రాజ్యసభ సభ్యుడు జవహర్ సిర్కార్ 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. కొన్ని అంశాలను ఆయన ప్రస్తావించారు. 1) ఒక చిన్న అరబ్ దేశం భారతీయ మాజీ సైనికులకు మరణశిక్ష విధించింది (అవమానకరమైన ఒప్పందం ద్వారా విడుదల చేయబడ్డారు) 2) ఒక సిక్కు కుట్రదారు హత్యకు భారత ప్రభుత్వంపై అమెరికా అభియోగాలు మోపింది. తర్వాత అమెరికా కోర్టు మన ఎన్ఎస్ఏకు సమన్లు జారీ చేసింది. 3) కెనడా... తన పౌరులను హత్య చేసిందని భారతదేశంపై అభియోగాలు మోపింది... ఇప్పుడు ఈ అంశం అంటూ సిర్కార్ తెలిపారు. తృణమూల్ రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ మాట్లాడుతూ... ఈ సమస్య చాలా సున్నితమైనది, తీవ్రమైనదన్నారు. 'కెనడాతో భారత్ దౌత్యపరమైన ప్రతిష్టంభన రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. అత్యంత సున్నితమైన, గంభీరమైన ఈ సమస్యపై ప్రధానమంత్రి మోదీ వెంటనే ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. భారతదేశ విదేశాంగ విధానం ఎల్లప్పుడూ ఏకపక్షవాదంపై కాకుండా దేశీయ ఏకాభిప్రాయాన్ని నిర్మించడంపై ఆధారపడి ఉంటుంది' అని ఘోష్ 'ఎక్స్'లో రాశారు. అతల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేసిన సుధీంద్ర కులకర్ణి మాట్లాడుతూ... భారతదేశం విషయాన్ని తీవ్రతరం చేయరాదని సూచించారు. బీజేపీ వైఖరితో విభేదిస్తూ, "దెబ్బతిన్న భారత్-కెనడా సంబంధాలను వీలైనంత త్వరగా తిరిగి ట్రాక్‌లోకి తీసుకురావాలి" అని అన్నారు. కెనడాలో భారత వ్యతిరేక ఖలిస్తానీ శక్తుల కార్యకలాపాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ పరిణామం జాతీయ భద్రతపై నేరుగా ప్రభావం చూపుతుందని సీపీఎం పేర్కొంది. 'భారతదేశంలోని అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఉన్న జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడం భారత ప్రభుత్వం విధి' అని సీపీఎం స్పష్టం చేసింది. బిష్ణోయ్ ముఠా భారత ప్రభుత్వ ఏజెంట్లతో సంబంధం కలిగి ఉందని...ఇది దక్షిణాసియా సమాజాన్ని ప్రత్యేకంగా దేశంలోని ఖలిస్థానీ అనుకూల శక్తులను లక్ష్యంగా చేసుకుంటోందని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు ఆరోపించగా... కేంద్రం ఖండించింది. ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారతీయ ఏజెంట్ల ప్రమేయం ఉన్నట్లు కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో గత ఏడాది సెప్టెంబర్‌లో చేసిన ఆరోపణల చేసిన తర్వాత భారత్- కెనడా మధ్య సంబంధాలు మసకబారడం ప్రారంభమైంది.

13న వయనాడ్ ఉప ఎన్నిక

షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ

న్యూదిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రాజీనామాతో వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రకటించింది. నవంబర్ 13వ తేదీన ఈ లోక్‌సభ నియోజకవర్గ ఉపఎన్నిక నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను సైతం కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. వయనాడ్ లోక్‌సభతో పాటు యూపీలోని 9 అసెంబ్లీ స్థానాలు, పంజాబ్‌లోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. ఉప ఎన్నికలు జరిగే స్థానాలకు నవంబర్ 13వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని, నవంబరు 23న ఫలితాలు ప్రకటిస్తామని రాజీవ్‌కుమార్ వెల్లడించారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీ వరుసగా రెండుసార్లు గెలుపొందారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ సహా వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ బరిలో దిగారు. కానీ ఆ ఎన్నికల్లో అమేథీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి పాలయ్యారు. వయనాడ్‌లో రాహుల్ విజయం సాధించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గెలుపొందారు. దీంతో వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ వయనాడ్ నుంచి బరిలో దిగుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

యూపీలో 9 స్థానాలకు ఉపఎన్నిక

ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల తేదీని ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో ఉపఎన్నికలు జరగనున్న 9 అసెంబ్లీ స్థానాల్లో మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, ఖైర్, కర్హాల్, సిషామౌ, ఫూల్పూర్, కతెహారి, మజవాన్ ఉన్నాయి. వీటిలో నాలుగు స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకోగా, బీజేపీ 3, రాష్ట్రీయ లోక్‌దళ్, నిషాద్ పార్టీ చెరో స్థానం గెలుచుకున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన ఆయా పార్టీల నేతలు తాము గెలిచిన అసెంబ్లీ స్థానాలను వదులుకోవడంతో యూపీలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి

పంజాబ్‌లో నాలుగు అసెంబ్లీ స్థానాలకు...

పంజాబ్‌లోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికల తేదీని ఈసీ ప్రకటించింది. నవంబర్ 13న పోలింగ్ నిర్వహిస్తారు. పంజాబ్‌లో ఉప ఎన్నికలు జరగనున్న నాలుగు అసెంబ్లీ స్థానాల్లో దేరాబాబా నానక్, చబ్బేవాల్, గిదడ్బాహ, బర్నాలా నియోజకవర్గాలు ఉన్నాయి. సుఖ్జిందర్ సింగ్ రాంధ్వా రాజీనామాతో దేరాబాబా నానక్‌లోనూ, డాక్టర్ రాజ్ కుమార్ రాజీనామాతో చబ్బెవాల్ నియోజకవర్గంలోనూ, అమరీందర్ సింగ్ రజా వారింగ్ రాజీనామాతో గిదడ్బాహలోనూ, గుర్మీత్ సింగ్ మీత్ హయర్ రాజీనామాతో బర్నాలాలోనూ ఉపఎన్నికలు అనివార్యమయ్యాయి.

రూ.1.36 లక్షల కోట్ల 'బొగ్గు' బకాయిలు చెల్లించాలి

ప్రధానికి జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ లేఖ

రాంచీ: బొగ్గు కంపెనీల నుండి జార్ఖండ్‌కు రావాల్సిన రూ. 1.36 లక్షల కోట్ల బకాయిల్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ లేఖ రాశారు. తాను రాష్ట్రానికి ప్రత్యేక బడ్జెట్ కోరడంలేదని... రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను మాత్రమే అడుగుతున్నానని సోరెన్ పేర్కొన్నారు. నిధులు అందకపోవడంతో జార్ఖండ్ అభివృద్ధి దెబ్బతింటోందని సోరెన్ స్పష్టం చేశారు. 'ఈ బకాయి మొత్తం మా హక్కు.. జార్ఖండ్ ప్రత్యేక బడ్జెట్ కోసం మిమ్మల్ని సాయం చేయమని అడగడం లేదు. మేము మా హక్కులను మాత్రమే అడుగుతున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకుంటాం" అని సోరెన్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ... ప్రధానికి బహిరంగ లేఖను సైతం పంచుకున్నారు. "చట్ట పరంగా, న్యాయపరంగా నిబంధనలు ఉన్నప్పటికీ బొగ్గు కంపెనీలు ఎటువంటి చెల్లింపులు చేయడం లేదు... ఈ ప్రశ్నలు ఆర్థిక మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్‌తో సహా వివిధ వేదికలపై లేవనెత్తినప్పటికీ ఇప్పటి వరకు ఈ పరిహారం (రూ. 1.36లక్ష కోట్లు) ఇంకా చెల్లించలేదు' అని ఆయన అన్నారు. తనకు రావాల్సిన మైనింగ్ రాయల్టీ బకాయిలను వసూలు చేసే హక్కు రాష్ట్రాలకు ఉందని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చిందని సోరెన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ బకాయిల కారణంగా జార్ఖండ్ అభివృద్ధి కుంటుపడిందని, సామాజిక-ఆర్థిక ప్రాజెక్టులకు ఆటంకం కలిగిస్తోందని సోరెన్ పేర్కొన్నారు. రాష్ట్రానికి బకాయిపడిన మొత్తాన్ని కోల్ ఇండియా ఖాతానుంచి నేరుగా రాష్ట్రానికి జమ చేయాలని గత నెలలో ఆయన సూచించారు. 'రాష్ట్రం లేవనెత్తిన న్యాయమైన డిమాండ్ చెల్లింపులో జరుగుతున్న ఉద్దేశపూర్వక జాప్యం, నిర్లక్ష్యం కారణంగా జార్ఖండ్‌కు, దాని ప్రజలకు కోలుకోలేని నష్టం జరుగుతోంది. విద్య, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి వివిధ సామాజిక రంగ పథకాలు, రహదారుల నిర్మాణం వంటి మౌలిక వసతుల నిర్మాణ పథకాలు నిధుల కొరత కారణంగా క్షేత్రస్థాయిలో అమలు చేయడం సాధ్యం కాలేదు' అని సోరెన్ ప్రధాని మోదీకి రాసిన లేఖలో స్పష్టం చేశారు.

కలెక్టర్ ముందే అవమానం... ఉన్నతాధికారి ఆత్మహత్య

కన్నూర్: బదిలీ వీడ్కోలు సభలో తనపై అవినీతి ఆరోపణలు రావడాన్ని అవమానంగా భావించిన ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేరళలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేరళకు చెందిన నవీన్‌బాబు కన్నూర్ జిల్లాలో అదనపు జిల్లా మెజిస్ట్రేట్‌గా పని చేశారు. ఇటీవల ఏడీఎంగా ఆయన వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో సహోద్యోగులంతా వీడ్కోలు సభ నిర్వహించారు. ఆ సభకు జిల్లా కలెక్టర్ సైతం హాజరయ్యారు. జిల్లా పంచాయతీల అధ్యక్షురాలు పీపీ దివ్య సభలో మాట్లాడుతూ నవీన్‌బాబు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెట్రోల్ బంకు అనుమతికి సంబంధించిన ఫైల్‌ను ఎన్నో రోజులు పక్కనపెట్టి రెండ్రోజుల కిందటే ఆమోదించారని, అలా ఎందుకు చేశారో తెలుసని ఆమె అన్నారు. రెండ్రోజుల్లో మరిన్ని విషయాలు వెల్లడిస్తానన్నారు. సభకు హాజరైన కలెక్టర్ ముందే దివ్య తనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని అవమానంగా భావించిన నవీన్‌బాబు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మంగళవారం పల్లికున్నులోని తన క్వార్టర్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు.

సైబర్ నేరాల కట్టడికి సమష్టి కృషి

- ఏఐ సద్వినియోగానికి కార్యాచరణ అవశ్యం
- ఐఎంసీ-డబ్ల్యూటీఎస్ఏ ప్రారంభోత్సవంలో మోదీ

న్యూదిల్లీ: సైబర్ నేరాల నియంత్రణ, కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతిక దుర్వినియోగాన్ని కట్టడి చేసేందుకు కలిసికట్టుగా పనిచేయడం అవసరమని, ఇందుకు కలిసి రావాలని అంతర్జాతీయ సంఘాలకు ప్రధాని మోదీ సూచించారు. 'గ్లోబల్ గవర్నెన్స్' ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. టెక్నాలజీ దుర్వినియోగంతో వచ్చే సమస్యలు- ఎదురయ్యే సవాళ్లు అధిగమించాలంటే అంతర్జాతీయ సంస్థలు బాధ్యత తీసుకోవాలని నొక్కిచెప్పారు. సమష్టిగా కృషితోనే ఆయా సవాళ్లను అధిగమించగలమని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. పెరుగుతున్న సైబర్ నేరాలతో ప్రజలపై దుష్ప్రభావం గురించి ప్రధాని ఆందోళన వ్యక్తంచేశారు. డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) సక్రమ వినియోగానికి అంతర్జాతీయ స్థాయి కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరస్పరం అనుసంధానించబడిన ప్రపంచంలో భద్రతకు ప్రాధాన్యత అత్యవసరమన్నారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ), వరల్డ్ టెలి కమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యూటీఎస్ఏ) ప్రారంభోత్సవంలో మోదీ మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత కోసం అంతర్జాతీయ కార్యాచరణ/మార్గదర్శకాలు రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గ్లోబల్ గవర్నెన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను అంతర్జాతీయ సంస్థలు అంగీకరించేందుకు ఇదే సమయమన్నారు. టెలికమ్యూనికేషన్ కోసం సేఫ్ ఛానల్, సురక్షిత డిజిటల్ ఎకో సిస్టమ్ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించాలని డబ్ల్యూటీఎస్ఏకు పిలుపునిచ్చారు. సురక్షిత డిజిటల్ వాతావరణం ఏర్పాటుకు భారత్‌కు ఉన్న నిబద్ధతను భారత్ డేటా పరిరక్షణ చట్టం, జాతీయ సైబర్ భద్రత వ్యూహం వంటివి ప్రతిబింబింపజేస్తాయని మోదీ తెలిపారు. ఏవియేషన్ రంగాన్ని ఉదాహరణగా తీసుకొని ఆ తరహా కార్యాచరణను రూపొందించడం డిజిటల్ ప్రపంచానికి అవసరమన్నారు. ఈ విషయంలో అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చి బాధ్యత తీసుకోవాలని కోరారు. నాటి సిల్క్ మార్గం కానీ నేటి సాంకేతిక మార్గం కానీ భారత్ ఏకైక లక్ష్యం ప్రపంచాన్ని అనుసంధానం చేయడం ద్వారా ప్రగతికి బాటలు వేయడమేనని మోదీ నొక్కిచెప్పారు. డిజిటల్ సంస్కరణల్లో ఏ దేశం-ఏ ప్రాంతం- ఏ వర్గం వెనుకబడరాదన్నదే ధ్యేయమన్నారు. చేరిక (ఇంక్లూషన్)తో ఆవిష్కరణ (ఇన్నోవేషన్) అవసరాన్ని గుర్తించాలని మోదీ సూచించారు. పది రోజులు సాగే ఈ సమావేశాలలో 6జీ, ఏఐ, ఐఓటీ, బిగ్ డేటా, సైబర్ భద్రత వంటి కొత్తతరం సాంకేతికల పరిమాణాలపై 190 దేశాల ప్రతినిధులు, 3వేల మంది పరిశ్రామికవేత్తలు, నిపుణులు చర్చిస్తారు. సమావేశాల తొలి రోజు ప్రసంగించిన వారిలో భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ మిట్టల్, రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ, కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఉన్నారు.

షిండే సర్కారు ఓట్ల గాలం

శివసేన (యూబీటీ) విమర్శ

ముంబై: ముంబై నగరానికి చెందిన ఐదు ప్రవేశ పాయింట్ల వద్ద తేలిక పాటి వాహనాలకు టోల్ ట్యాక్స్ రద్దు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిపక్ష శివసేన (యూబీటీ) మంగళవారం విమర్శించింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ఖజానాపై రూ.5 వేల కోట్ల అదనపు భారం పడుతుందని పేర్కొంది. అలాగే పూణె మెట్రో రెండవ దశ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్)-2.0, నీటిపారుదల పథకానికి సంబంధించిన వాటితో సహా ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న వేర్వేరు నిర్ణయాలపై శివసేన (యూబీటీ) పత్రిక 'సామ్నా' సంపాదకీయం విమర్శించింది. ఈ పథకాలకు ప్రభుత్వం వద్ద డబ్బు ఉందా? అని ప్రశ్నించింది. ముంబైలో ఐదు ప్రవేశ పాయింట్ల వద్ద తేలికపాటి వాహనాలకు టోల్ ట్యాక్స్ రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ... ఎన్నికలకు ముందు షిండే ప్రభుత్వం 'జుమ్లేబాజీ' (వాక్చాతుర్యం) ప్రదర్శిస్తోందని ఈ మరాఠా దినపత్రిక పేర్కొంది. అప్పటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ టోల్ మాఫీ చేసేందుకు కంపెనీలతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలు, షరతులను ఎత్తి చూపింది. ప్రభుత్వం ఇవ్వాల్సిన వేల కోట్ల పరిహారం ఏమవుతుంది? అని సంపాదకీయం ప్రశ్నించింది. 'ఈ టోల్ మాఫీ వల్ల ప్రభుత్వంపై పడే అదనపు భారం రూ.5 వేల కోట్లు? అది మరింత తెలుసుకోవాలని కోరింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఆర్థిక కేటాయింపు అంశాలపై స్పష్టత ఇవ్వలేదని సంపాదకీయంలో పేర్కొంది. మహారాష్ట్రలో వివిధ కులాలు, ఉపకులాల కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్పొరేషన్‌లను ప్రకటించింది. అయితే అది రాష్ట్రవ్యాప్తంగా చెల్లాచెదురుగా ఉన్న క్రైస్తవ సమాజాన్ని మరచిపోయిందని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ పత్రిక వివరించింది. సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సోమవారం ముంబైలోకి ప్రవేశించడానికి ఐదు టోల్ బూత్‌లలో తేలికపాటి మోటారు వాహనాలకు పూర్తి టోల్ మినహాయింపును ప్రకటించారు. షిండే నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని రెండవ అతిపెద్ద నగరమైన పూణేలో రెండు కొత్త మెట్రో రైలు మార్గాలను కూడా ఆమోదించింది.

మణిపూర్ సమస్య పరిష్కారానికి చర్చలు

మెయితీ, కుకీ, నాగా ఎమ్మెల్యేల భేటీ

ఇంఫాల్: మణిపూర్‌లో జాతి ఘర్షణలు చెలరేగిన 17 నెలల తర్వాత తొలిసారిగా మెయితీ, కుకీ, నాగా సామాజిక వర్గాలకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలు... కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో మంగళవారం న్యూదిల్లీలో సమావేశమైనట్లు అధికారులు తెలిపారు. అల్లర్లతో కొట్టుమిట్టాడుతున్న వర్గాల మధ్య చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాల్లో భాగంగా ఇది ఉందన్నారు. మే 2023 నాటి నుంచి మణిపూర్‌లో జాతి అల్లర్లలో 200 మందికి పైగా ప్రజలు మరణించారు. సమావేశానికి హాజరైన వారిలో అసెంబ్లీ స్పీకర్ తోక్‌చోమ్ సత్యబ్రత సింగ్, టోంగ్‌బ్రామ్ రాబింద్రో, మెయితీ వైపు నుంచి బసంతకుమార్ సింగ్, కుకీ ఎమ్మెల్యేలు లెట్‌పావో హౌకిప్, నెమ్చా కిప్‌జెన్ (ఇద్దరూ రాష్ట్ర మంత్రులు) ఉన్నారు. నాగా సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు రామ్ ముయివా, అవాంగ్‌బో న్యూమై, ఎల్ దిఖో ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ సంభాషణకర్త ఏకే మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ హాజరుకాలేదు. మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దడానికి కుకీలు, మెయితీ మధ్య చర్చలు అవసరమని, కేంద్రం రెండు వర్గాలతో చర్చిస్తోందని అమిత్‌షా చెప్పిన దాదాపు నెల తర్వాత ఈ చర్చలు జరిగాయి. జూన్ 17న ఈశాన్య రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించినప్పుడు హోం మంత్రి కూడా ఇదే విధమైన ప్రకటన ఇచ్చారు. మణిపూర్‌లో కొనసాగుతున్న సంఘర్షణను పరిష్కరించడానికి సమన్వయంతో కూడిన విధానం ప్రాముఖ్యతను షా నొక్కిచెప్పారని మంత్రిత్వ శాఖ నుంచి వెలువడిన ఒక ప్రకటన పేర్కొంది. జాతి ఘర్షణలను వీలైనంత త్వరగా తగ్గించడానికి మెయితీ, కుకీలతో చర్చ నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

సిద్ధిఖీ హత్య కేసులో పురోగతి

నాల్గో నిందితుడు యూపీలో అరెస్టు

ముంబై: ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీ హత్య కేసుపై పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. దీంతో కేసులో పురోగతి కనిపించింది. ఇంకొకరిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని పూనేలో స్క్రాప్ డీలర్ హరీశ్ కుమార్ బాలక్‌రామ్ (23)ని ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్‌లో అరెస్టు చేసినట్లు ఓ అధికారి మంగళవారం చెప్పారు. సిద్దిఖీ హత్యలో ఇతనూ పాత్రధారుడేనన్నారు. తమ అదుపులో ఉన్న నిందితులు బాలక్‌రామ్‌కు చెందిన తుక్కు దుకాణంలో కొద్ది కాలం పని చేశారని, ఈ మధ్యనే వారికి కొత్త ఫోన్లు, కావాల్సిన సామాన్లు, డబ్బును బాలక్‌రామ్ సమకూర్చాడని విచారణలో తెలసిందని అన్నారు. సిద్దిఖీపై హత్యాయత్నం గురించీ అతనికి ముందే తెలుసన్నారు. బాలక్‌రామ్ అరెస్టుతో నలుగురు పట్టుబడినట్లు అయిందని చెప్పారు. ఇప్పటికే ఇద్దరు షూటర్లు హర్యానాకు చెందిన గుర్మయిల్ బల్జిత్ సింగ్ (23), ఉత్తరప్రదేశ్ వాసి ధర్మరాజ్ రాజేశ్ కశ్యప్ (19)తో పాటు సిద్ధిఖీ హత్యలో సహ-సూత్రధారి... పూనేకు చెందిన ప్రవీణ్ లోంకర్‌నూ పోలీసులు అరెస్టు చేశారు. మరొక షూటర్ శివకుమార్ గౌతం ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. సిద్ధిఖీ(66) ముంబైలోని నిర్మల్ నగర్ ప్రాంతంలో కుమారుడి కార్యాలయం ఎదుట హత్యకు గురైన సంగతి తెలిసింది. ఘటనాస్థలంలో అనుమానిత సంచి, తుపాకీ కూడా లభ్యమైనట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు.

పాస్ ఉంటేనే మరుగుదొడ్డిలోకి...

ముంబై మెట్రో వి-చిత్ర నిబంధన

ముంబై: రైళ్లలో మరుగుదొడ్డి వినియోగంపై ముంబై మెట్రో తీసుకొచ్చిన కొత్త నిబంధన చర్చనీయాంశమైంది. మెట్రోలో ప్రయాణించేవారు టాయిలెట్‌కు వెళ్లాలంటే దానికి సంబంధించిన పాస్ తప్పనిసరిగా నింపాల్సిందేనని షరతు విధించింది. మెట్రోలో ఒక ప్రయాణికుడికి ఈ అనుభవం ఎదురైంది. తన అనుభవాన్ని రెడ్డిట్ వేదికగా అతను పంచుకున్నాడు. ఆ పోస్ట్ కాస్త వైరల్ కావడంతో నెటిజన్లు స్పందించారు. ముంబై మెట్రోలోని మరుగుదొడ్డి ఉపయోగించుకోవాలంటే పేరు, ఫోన్ నంబర్, టికెట్ టోకెన్ నంబర్ నింపాల్సి ఉంటుందని ఆ ప్రయాణికుడు చెప్పాడు. దానికి టాయిలెట్ పాస్ అని పేరు పెట్టారని అన్నాడు. ఈ నిబంధన వల్ల తాను టాయిలెట్ పాస్ తీసుకుని మరుగుదొడ్డిని ఉపయోగించాల్సి వచ్చిందని వాపోయాడు. ఈ నిర్ణయంపై కొందరు నెటిజన్లు సరదాగా స్పందించారు. 'మీరు మూత్ర విసర్జన చేయాల్సి వస్తే... తొలుత రుసుము చెల్లించాలి' అని ఒక వినియోగదారుడు రాశాడు. 'మీ మూత్రం, మల నమూనాలను సేకరించడానికి వారికి పేర్లు, ఫోన్ నంబర్లు అవసరం' అని మరొకరు మండిపడ్డారు. 'నేను ముంబై మెట్రోలో ప్రయాణించాను. కానీ మీరు చెబుతున్నట్లు నాకు అలాంటి ఘటన ఎదురుకాలేదు. నేను ఘట్‌కోపర్‌లో మెట్రో టాయిలెట్ ఉపయోగించాను. టాయిలెట్ పాస్ తీసుకోవాలని నన్నెవరూ అడగలేదు' అని ఇంకొకరు అన్నారు. ఇలాంటి నిబంధనలను అమలు చేయడం వల్ల ప్రజా సౌకర్యాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించవచ్చని మరికొందరు అన్నారు. అయితే మరుగుదొడ్లను ఉపయోగించుకోవడానికి వ్యక్తిగత సమాచారం అడగడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. 'సరేలే... ఆధార్, బయోమెట్రిక్ అడగనందుకు సంతోషించాలి' అంటూ ఓ వినియోగదారుడు వ్యంగ్యంగా స్పందించాడు.

ఈవీఎంలలో లోపాలు లేవు

- హ్యాకింగ్ ఆరోపణలు అర్థరహితం
- ఎగ్జిట్ పోల్స్‌కు శాస్త్రీయత లేదు
- సీఈసీ రాజీవ్ కుమార్

న్యూదిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లో లోపాలు లేవని, హ్యాకింగ్‌కు లేక ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికల ఫలితాలపై విపక్షాల అనుమానాలను తోసిపుచ్చారు. ఓటింగ్ యంత్రాలు నూటికి నూరు శాతం సురక్షితమని నొక్కి చెప్పారు. ఇందులో ఉండే బ్యాటరీలు 5-7 రోజులు పనిచేస్తాయని, క్యాలుక్లేటర్ తరహా బ్యాటరీ ఈవీఎంలలో ఉంటుందన్నారు. వోల్టేజి తేడా వల్ల బ్యాటరీలో మార్పు కనిపించవచ్చని, 5.8శాతం వినియోగమైతే బ్యాటరీ చచ్చిపోతోందన్న సంకేతం అందుతుందని వివరించారు. ఈవీఎంల పనితీరుపై ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తూనే ఉన్నామని చెప్పారు. రాజీవ్ కుమార్ మంగళవారం మహారాష్ట్ర జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇదే సమయంలో ఈవీఎంల పనితీరుపై అనుమానాలను తోసిపుచ్చారు. అలాగే ఎగ్జిట్ పోల్స్‌లో ఈసీకి ప్రమేయం ఉండదని చెప్పారు. ఎగ్జిట్ పోల్స్‌కు శాస్త్రీయత ఉండదని తెలిపారు. ఓటింగ్ యంత్రాల పారదర్శకతపై సందేహం, తమపై ఆరోపణలు అర్థరహితమని రాజీవ్ కుమార్ అన్నారు. ఈవీఎంలను కేటాయించిన రోజు వాటిలో బ్యాటరీలు వేస్తారని, అవి అనుసంధానమై ఉండవు కాబట్టి హ్యాకింగ్‌కు వీలుండదని చెప్పారు. 'ఐదారు నెలల ముందు ఈవీఎంల ప్రక్రియ మొదలవుతుంది. ప్రతి అడుగు రాజకీయ పార్టీలు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో సాగుతుంది. కొత్త బ్యాటరీ వేసిన తర్వాత సీల్ చేసేంత వరకు వారి పర్యవేక్షణ ఉంటుంది. సీఏపీఎఫ్, పరిశీలకులతో పాటు మూడంచెల భద్రత ఉంటుంది. ప్రక్రియ మొత్తం వీడియో తీస్తాం. ఈవీఎంల నంబర్లు సంబంధిత అధికారులకు తెలియజేస్తారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా సంతకాలు తీసుకుంటారు. ఇంకెంత పారదర్శకత కావాలి? ఇంత పారదర్శకంగా విధానం మరెక్కడైనా ఉందేమో చెప్పండి? ఈ ప్రక్రియ సాగే ప్రతి దశలో అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు వీలు ఉంటుంది' అని సీఈసీ అన్నారు. ఎగ్జిట్ పోల్స్ గురించి మాట్లాడుతూ వాటికి శాస్త్రీయత లేదని, అవి కేవలం అంచనాలేనని ఆయనన్నారు. ఎగ్జిట్ పోల్స్‌లో తమకు ప్రమేయం ఉండదని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ప్రకటనలో మీడియాకు స్వీయ నియంత్రణ అవసరమని సూచించారు. ఎగ్జిట్ పోల్స్ సాధించలేని ఫలితాల ఆశ చూపుతాయని వ్యాఖ్యానించారు. 'ఎగ్జిట్ పోల్స్‌ను మేము నియంత్రించము కానీ ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని సంఘాలకు స్వీయ నియంత్రణ అవసరం. ఇందుకు ఇదే సమయం' అని వ్యాఖ్యానించారు. అంచనాలకు వాస్తవానికి మధ్య తేడాను ప్రస్తావిస్తూ ఇదే నిరుత్సాహానికి దారి తీస్తుందని సీఈసీ చెప్పారు. ట్రెండ్‌తో ఎగ్జిట్ పోల్స్ మధ్య ప్రత్యక్ష పోలికను ఒకరు ఆశించరాదని అన్నారు. ప్రజల్లో ఆశలు రేకెత్తించేందుకు... ఉత్కంఠ పెంచేందుకు ట్రెండ్స్ ప్రకటించే సమయం కూడా కీలకమన్నారు. ఫలితాలు ఉదయం 8.05 లేక 8.10 గంటలకు మొదలవుతాయనడం అర్థరహితమని రాజీవ్ కుమార్ అన్నారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8.30 గంటలకు మొదలవుతుందని, ఉదయం 9.30 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఫలితాలు ప్రకటిస్తారని, అవి అధికారిక వెబ్‌సైట్‌లో కనిపించడానికి మరో అర గంట సేపు పడుతుందని తెలిపారు. 30 నిమిషాలలోపు సింగిల్ రౌండ్ ఓట్ల లెక్కింపు జరగదని, తొలి రౌండ్ ఫలితాలు కనీసం 8.50 గంటలకు ముందు బయటకు రావని, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో 9.30 గంటల తర్వాతే అవి కనిపిస్తాయని సీఈసీ కుమార్ వివరించారు.

ఒకే రోజు 7 విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూదిల్లీ: దేశ-విదేశీ విమానాలకు వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతోంది. ఏకంగా ఏడు విమానాలకు 'ఎక్స్' వేదికగా మంగళవారం బెదిరింపులు వచ్చాయి. దీంతో వివిధ విమానాశ్రయాల్లో భద్రతా సంస్థలు.. ఉగ్రవాద నిరోధక డ్రిల్స్ నిర్వహించాయి. దిల్లీ-చికాగో, మదురై-సింగపూర్, జైపూర్-బెంగళూరు, మదురై- సింగపూర్ సహా ఏడు విమానాలకు కొన్ని గంటల వ్యవధిలోనే బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆయా విమానయాన సంస్థల సిబ్బంది, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ' సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలకు ఫిర్యాదు చేసింది. సంబంధిత 'ఎక్స్' ఖాతా తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. బెదిరింపుల దృష్ట్యా కొన్ని విమానాలు అత్యవసరంగా దిగాయి. 'డెహ్రాడూన్ నుంచి బయలుదేరిన విమానానికి బెదిరింపులు రాగా ముంబై ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దించాం. ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించి.. బాంబు స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చాం' అని స్పైస్‌జెట్ ప్రతినిధి తెలిపారు. బెదిరింపుల కారణంగా విమానాల రాకపోకల్లో ఆలస్యం, షెడ్యూల్లో మార్పులు చేయాల్సి వచ్చింది.కాగా సోమవారం న్యూయార్క్‌కు బయలు దేరిన విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అంతకు ముందుకు మస్కట్, జెడ్డాకు వెళ్లాల్సిన విమానాలకు బెదిరింపులు వచ్చాయి. రెండు రోజులలోనే 10 విమానాలకు బెదిరింపులు రాగా అవన్నీ బూటకమని ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

కెనడాకు ఎయిరిండియా విమానం మళ్లింపు

దిల్లీ నుంచి చికాగో వెళ్లే ఏఐ127 దిల్లీ నుంచి బయలుదేరగా ముప్పు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో పోస్టు కనిపించింది. విమానాన్ని కెనడాలోని ఇకాలూట్ ఎయిర్‌పోర్టుకు మళ్లించి తనిఖీలు నిర్వహించినట్లు ఎయిరిండియా తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 7 గంటలకు చికాగో చేరుకోవాల్సిన విమానం ఆలశ్యమైనట్లు సమాచారం.

అబ్దుల్ కలామ్‌కు వైసీపీ నేతల నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు వైసీపీ నేతలు ఘన నివాళులర్పించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కలాం చిత్రపటానికి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ నాయకులు మందపాటి శేషగిరిరావు, ఇతర నేతలు పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. భారతజాతి గర్వించదగ్గ గొప్ప మేధావి, క్షిపణి పితామహుడు, అబ్దుల్ కలాం స్ఫూర్తి దేశానికే ఆదర్శమని వైసీపీ నేతలు కొనియాడారు.

స్కిల్ కేసులో రూ.23కోట్ల ఆస్తుల స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో రూ.23 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. సిమెన్స్ కంపెనీకి చెందిన ముంబై, దిల్లీ, పూనేలోని ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ఏపీ సీఐడీ కేసు ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా వస్తువులు కొనుగోలు చేసినట్లు, స్కిల్ డవలప్‌మెంట్ నిధులను వ్యక్తిగత ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ గుర్తించింది. కేసులో డీటీసీఎల్ ఎండీ ఖాన్విల్కర్, సుమన్ బోస్, ముకుల్ చాంద్ ఆస్తులను స్వాధీనం చేసుకుంది. గత ప్రభుత్వం స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌పై సీఐడీతో విచారణకు ఆదేశించింది.

దివ్యాంగ విద్యార్థికి ఎంబీబీఎస్ ప్రవేశాన్ని అడ్డుకోలేం: సుప్రీం

న్యూదిల్లీ: అంగ వైకల్యంతో బాధ పడుతున్న కారణంగా ఎంబీబీఎస్‌లో ప్రవేశాన్ని అడ్డుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 40శాతం వైకల్యం ఉన్నంత మాత్రానా ఎంబీబీఎస్ చదివేం దుకు ఆ విద్యార్థి అసమర్థుడని నిపుణుల నివేదిక ఉంటే తప్ప అడ్డు చెప్పబోమని వెల్లడించింది. ఈ వ్యవహారాన్ని జస్టిస్ బీఆర్.గవాయి, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఎలాంటి ఆటంకం లేకుండా వైద్య విద్యను అభ్యసించవచ్చని మెడికల్ బోర్డ్ అభిప్రాయపడిన తర్వాత ఎంబీబీఎస్ ప్రవేశానికి అనుమతిస్తూ సెప్టెంబర్ 18న జారీ చేసిన ఉత్తర్వులకు కోర్టు వివరణను ఇచ్చింది. వైకల్యంతో బాధ పడుతున్న అభ్యర్థి ఎంబీబీఎస్ చదివేం దుకు అర్హుడా కాదా అన్నది వికలాంగ అసెస్‌మెంట్ బోర్డ్ పరిశీలించాల్సి వుంటుందని పేర్కొంది. 40 శాతం లేదా అంతకన్నా ఎక్కువ వైకల్యం ఉన్న అభ్యర్థిని ఎంబిబిఎస్ చదవకుండా అడ్డుకున్న 1997 నాటి గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్‌ను సవాలు చేస్తూ ఓంకార్ అనే విద్యార్థి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ తీర్పునిచ్చింది.

అడవులు పెంచకపోతే హైవేలు కూల్చాల్సిందే

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఝలక్ ఇచ్చింది. తాజ్‌మహల్ పరిరక్షణ జోన్‌లో (టీటీజెడ్) అడవులు పెంచకపోతే అక్కడ నిర్మించిన హైవేలను తొలగించి...ఆ భూములను పూర్వస్థితికి తేవాలని ఆదేశిస్తామని తేల్చిచెప్పింది. టీటీజెడ్‌లో అడవులు పెంచాలన్న నిబంధనలను ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు బేఖాతరు చేస్తున్నాయని ఆక్షేపించింది. టీటీజెడ్‌లోని కీతం, భాండై స్టేషన్ల మధ్య బైపాస్ రైల్వే లైన్ నిర్మించడానికి వీలుగా 5,094 చెట్లను కొట్టేసేందుకు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌కు అనుమతి ఇవ్వడంపై జస్టిస్ అభయ్ ఎస్ ఓక్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్టే విధించింది. 'కోర్టు ధిక్కార చర్యలతో పాటు భూములను యథాతథ స్థితికి తేవాలని ఆదేశాలిస్తామని ప్రతి ఒక్కరికి స్పష్టం చేయదలిచాం. ప్రజా ప్రయోజనా లకు భూములను వినియోగించుకోవా లనుకుంటే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

న్యాయం ఇంకెప్పుడు

మమత సర్కార్‌కు యువ వైద్యుల ప్రశ్న

కోల్‌కతాలో భారీ ర్యాలీ - పాల్గొన్న వేలాది మంది

కోల్‌కతా: 'మా సోదరికి న్యాయం జరిగేది ఎప్పుడు. మా గోడు మీకు పట్టదా? మా న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం ఎప్పుడు' అంటూ కోల్‌కతాలోని జూనియర్ వైద్యులు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ తమ సమస్యను పరిష్కరించే చిత్తుశుద్ధి మమత సర్కార్‌కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జీ కర్ మెడికల్ కాలేజి, ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా మానవహారం ఏర్పాటు చేసి యువ వైద్యులు నిరసన తెలిపారు. 'దోహర్ కార్నివల్' పేరిట నగరంలోని రాణి రష్మోని రోడ్డుపై ప్రదర్శన నిర్వహించారు. రెడ్ రోడ్డుపై దుర్గాపూజ కార్నివల్ జరిగే చుట్టుపక్కల ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధిస్తూ కలకత్తా హైకోర్టు ఆదేశాలిచ్చిన క్రమంలో యువ వైద్యుల ర్యాలీ జరిగింది. అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలిపారు. వైద్యులకు మద్దతుగా వేలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'మాకు న్యాయం కావాలి'. 'న్యాయాన్ని డిమాండ్ చేస్తున్నాం' వంటి నినాదాలు చేశారు. 'అభయకు న్యాయం' వంటి పాటలు పాడారు. జూనియర్ వైద్యుల డిమాండ్లను ప్రముఖంగా పేర్కొంటూ పోస్టర్లు ప్రదర్శించారు. వైద్యుల ఆందోళనకు సంఘీభావంగా వైద్యులు ఐక్యవేదిక 'ద్రోహర్ కార్నివల్'ను నిర్వహించింది. రెడ్ రోడ్డు వద్ద రాణి రష్మోని రోడ్డు మీద ఈ కార్యక్రమం జరిగింది. 2016 నుంచి దుర్గాపూజ కార్నివల్‌ను ఇదే రోడ్డుపై బెంగాల్ ప్రభుత్వం నిర్వహిస్తోంది. బెంగాల్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి సామాన్యుల నుంచి వచ్చే ప్రతిస్పందన ఇది... ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి యువ రైతుల గోడు పట్టడం లేదు. ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ ఇలాంటి పరిస్థితి దురదృష్టకరం' అని దేబాషీశ్ హల్దర్ అనే జూనియర్ డాక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. జూనియర్ వైద్యులు ఈనెల 5వ తేదీ నుంచి ఆమరణ దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే.

పండగ వేళ ముఖ్య పట్టణాలకు ప్రత్యేక రైళ్లు



న్యూదిల్లీ: దీపావళి, చాత్ పూజ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు భారతీయ రైల్వే మంగళవారం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన ప్రజలు మళ్లీ స్వస్థలాలకు చేరేందుకు ఈ ప్రత్యేక రైళ్లు ఉపయోగపడతాయని తెలిపింది. అక్టోబర్ 22వ తేదీ నుంచి ఎల్‌టీటీ - దానాపూర్ (01143) మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు తెలిపింది. ముంబైలోని ఎల్‌టీటీ నుంచి ఉదయం 10.30 గంటలకు ఈ రైలు బయలుదేరుతుందని చెప్పింది. ఆ మరునాడు సాయంత్రం 6.30 గంటలకు దానాపూర్‌కు రైలు చేరుకుంటుందని వివరించింది. ఈ రైలు ప్రతి రోజు నడుస్తుందని పేర్కొంది. నవంబర్ 11వ తేదీ వరకు ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. అలాగే దానాపూర్ - ఎల్‌టీటీ (01144)మధ్య ప్రతి రోజు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వివరించింది. అక్టోబర్ 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు దానాపూర్‌లో ఈ రైలు బయలుదేరుతుంది. మూడో రోజు ఉదయం 4.30 గంటలకు ఎల్‌టీటీకి చేరుకుంటుంది. నవంబర్ 12వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైలు ప్రతి రోజు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని భారతీయ రైల్వే పేర్కొంది. ఇక సీఎస్ఎంటీ - అసన్‌సోల్ (01145) మధ్య ప్రతి సోమవారం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు చెప్పింది. సీఎస్ఎంటీలో ఉదయం 11.05 గంటలకు ఈ ప్రత్యేక రైలు బయలుదేరుతుంది. మూడో రోజు తెల్లవారుజామున 2.30 గంటలకు అసన్‌సోల్‌కు చేరుకుంటుంది. అలాగే (01146) అసన్‌సోల్ - సీఎస్ఎంటీ మధ్య ప్రతి బుధవారం ఈ రైలు నడుస్తుంది. అసన్‌సోల్‌లో రాత్రి 9.00 గంటలకు బయలుదేరి మూడో రోజు ఉదయం 8.15 గంటలకు సీఎస్ఎంటీ చేరుకుంటుంది.

ఇక పూణె - దానాపూర్ (01202) మధ్య ప్రతీ రోజు ప్రత్యేక రైలు నడవనుంది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉండనుంది. పూణెలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి... ఆ మరునాడు తెల్లవారుజాము 2.00 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. ఇక 01206 దానాపూర్ - పూణె మధ్య ప్రత్యేక రైలు ప్రతి రోజు నడవనుంది. దానాపూర్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి... ఆ మరునాడు సాయంత్రం 6.15 గంటలకు పూణె చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు అక్టోబర్ 27 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు అందుబాటులో ఉండనుంది. సీఎస్ఎంటీ- అగర్తల (01605) (%జూమీ-ాాస్తుఖుత్రీఖ ఔవవనెశ్రీఎ ాజూవఎఖుశ్రీ%) మధ్య ప్రత్యేక రైలు నడపనుంది. ప్రతి గురువారం సీఎస్ఎంటీలో 11.05 గంటలకు ఈ రైలు బయలుదేరుతుంది. ఆదివారం 1.10 గంటలకు ఈ ప్రత్యేక రైలు అగర్తలకు చేరుకుంటుంది. ప్రతి ఆదివారం ఆగర్తలలో సాయంత్రం 3.10 గంటలకు రైలు బయలుదేరుతుంది. బుధవారం తెల్లవారుజామున చేరుకుంటుంది. నవంబర్ 3వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ మధ్య ఈ ప్రత్యేక రైలు నడవనుంది. ఎల్‌టీటీ - బనారస్ మధ్య ప్రత్యేక రైలు (01053) నడపనుంది. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 6 మధ్య ఈ రైలు నడవనుంది. ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఈ రైలు బయలుదేరనుంది. ఆ మరునాడు సాయంత్రం 4.05 గంటలకు వారణాసి చేరుకోనుంది. బెనారస్ నుంచి ఎల్‌టీటీకి ప్రతి గురువారం ఈ ప్రత్యేక రైలు 01504 బయలుదేరనుంది. బెనారస్‌లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి... ఆ మరునాడు ఎల్‌టీటీకి 11.35 గంటలకు చేరనుంది.అక్టోబర్ 26, 28, నవంబర్ 2, 4 తేదీల మధ్య వారంలో రెండుసార్లు ఎల్‌టీటీ-దానాపూర్ మధ్య ఈ ప్రత్యేక రైలు (01009)నడవనుంది. అక్టోబర్ 27, 29, నవంబర్ 3,5 తేదీల మధ్య వారంలో రెండుసార్లు దానాపూర్- ఎల్‌టీటీ మధ్య ప్రత్యేక రైలు (01010) నడవనుంది. ఎల్‌టీటీ - ప్రయాగరాజ్ మధ్య ప్రత్యేక రైలు నడుస్తుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య ప్రత్యేక రైలును వారంలో ఒక రోజు నడపనుంది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఈ రైలు (01045) ప్రయాణికులకు అందుబాటులో ఉండనుంది. అలాగే ప్రయాగరాజ్ నుంచి ఎల్‌టీటీ మధ్య వారంలో ఒక రోజు ఈ రైలు (01046) నడవనుంది. ఈ రైలు అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ వరకు అందుబాటులో ఉండనుంది. ఎల్‌టీటీ నుంచి గోరఖ్‌పూర్‌కు కొన్ని ప్రత్యేక రైళ్లు నడపనుంది.

సాయిబాబా మృతి ప్రజాస్వామ్యానికి కళంకం

రావుల వెంకయ్య, క్షీరసాగర్

న్యూదిల్లీ: దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) నివాళులర్పించింది. గొప్ప మేధావి, మానవహక్కుల పోరాట యోధుడు అంటూ సాయిబాబాను మంగళవారం ఒక ప్రకటనలో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్ శ్లాఘించారు. సాయిబాబా మరణం ప్రజాస్వామ్యానికి కళంకమని వ్యాఖ్యానించారు. పాలక పక్షం రాజ్యాంగ విలువలను బేఖాతరు చేస్తుందనేందుకు ఈ వ్యవహారమే నిదర్శనమని పేర్కొన్నారు. రాక్షస చట్టమైన ఉపా దుర్వినియోగానికి, న్యాయం చేయడంలో న్యాయ వ్యవస్థ వైఫల్యానికి, జైళ్లలోని అమానవీయ పరిస్థితులకు సాయిబాబా కేసే నిదర్శనమని వ్యాఖ్యానించారు. గిరిజనులు, మానవుల హక్కుల కోసం పోరాడే ఏఐకేఎస్ తరపున సాయిబాబాకు నివాళులర్పించారు. న్యాయం కోసం, సమానత్వం కోసం పోరాటాన్ని కొనసాగించేందుకు ఏఐకేఎస్ కట్టుబడి ఉందని రావుల వెంకయ్య, క్షీరసాగర్ తెలిపారు.

అదానీ గ్రూపునకు ప్రజాసంపద దోచిపెడతారా?

మహాయుతి సర్కార్‌పై కాంగ్రెస్ మండిపాటు

న్యూదిల్లీ: మహారాష్ట్రలో ఏకనాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వానికి తాము తిరిగి అధికారంలోకి రాలేమని తెలుసని... అందుకే చివరి రోజుల్లో ముంబై, రాష్ట్ర ప్రజల సంపదను అదానీ గ్రూపునకు దోచిపెడుతోందని కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదిక ట్వీట్ చేశారు. 'మహాయుతి ఎన్నికల భవిష్యత్తు అంధకారంగా ఉంది. కానీ అధికారాన్ని కోల్పోయే ముందు మోదానీ ఆర్థిక భవిష్యత్తును కాపాడుకోవాలి' అని అధిష్ఠానం నుండి వచ్చిన సూచనలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కొన్ని అంశాలను లేవనెత్తారు. 'సెప్టెంబర్ 15 2024: మహారాష్ట్రకు 6,600 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేయడానికి మోదానీ ఇంధన కాంట్రాక్ట్‌ను గెలుచుకుంది. సెప్టెంబర్ 30 2024: పర్యావరణ పరంగా సున్నితంగా ఉన్న 255 ఎకరాల భూమిని మోదానీకి అప్పగించారు. అక్టోబర్ 10 2024: మద్‌లోని 140 ఎకరాల భూమి సైతం మోదానీకి అప్పగించబడింది. అక్టోబర్ 14 2024: ముంబైలోని డియోనార్ ల్యాండ్‌ఫిల్ నుండి 124 ఎకరాలను మోదానీకి అప్పగించారు' అని జైరామ్ విమర్శించారు.

ఏపీకి క్షిపణి ప్రయోగ కేంద్రం

న్యూదిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటు కానుంది. నాగాయలంకలో దీని ఏర్పాటుకు కేంద్రం ఆమోదించింది. ఈ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ నేతృత్వ భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పరీక్షించడం, ముఖ్యంగా రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. క్షిపణి వ్యవస్థ, యాంటి ట్యాంక్ క్షిపణులు, వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పర్యవేక్షించనున్నట్లు డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో) ఓ ప్రకటన చేసింది.

80 లక్షలకుపైగా భారతీయ ఖాతాలపై నిషేధం

వాషింగ్టన్: వాట్సాప్ సంస్థ మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌కు చెందిన 80 లక్షలకు పైగా ఖాతాలపై నిషేధం విధించింది. ప్రైవసీ పాలసీని ఉల్లంఘించాయంటూ ఒక్క ఆగస్టులోనే భారీ సంఖ్యలో ఖాతాలపై నిషేధం విధించింది. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న క్రమంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఐటీ చట్టం 2021 నిబంధనలను అనుసరించి ఆగస్టు 1-31 తేదీల మధ్య 84,58,000 భారతీయ ఖాతాలపై చర్యలు చేపట్టినట్లు తెలిపింది. వీటిలో సుమారు 16,61,000 ఖాతాలను ముందు జాగ్రత్త చర్యగా నిషేధించినట్లు పేర్కొంది. మోసానికి పాల్పడిన బల్క్ మెసేజ్‌లు లేదా అసాధారణ మెసేజ్‌లను ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా గుర్తించి చర్యలు చేపట్టినట్లు సంస్థ వెల్లడించింది. ఆగస్టులో గ్రీవెన్స్ యంత్రాంగం ద్వారా వినియోగదారుల నుంచి 10,707 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 93 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపింది. ఆయా ఖాతాల వివరాలను భారతీయ గ్రీవెన్స్ అధికారికి ఇమెయిల్, పోస్టల్ చానల్‌ల ద్వారా పంపామని పేర్కొంది.

బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు కసరత్తు

నేడు 8 మంది బీసీ మంత్రుల సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బీసీలకు మేలు కలిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఎనిమిది మంది బీసీ మంత్రుల సమావేశం బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం అయిదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీల రక్షణకు చట్టం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం హామీ ఇచ్చారన్నారు. బీసీ డిక్లరేషన్‌లోనూ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఎనిమిది మంది బీసీ మంత్రులు సమావేశమవుతున్నట్లు ఆమె వెల్లడించారు. తనతో పాటు మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సత్య కుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొంటున్నారని తెలిపారు. హోం శాఖ మంత్రి అనిత కూడా పాల్గొంటారని అన్నారు. బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై చర్చిస్తామని, తీసుకున్న నిర్ణయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు.

సల్మాన్ ఖాన్‌కు వై ప్లస్ భద్రత

ముంబై: ఎన్‌సీపీ సీనియర్ నేత బాబా సిద్దిఖీ హత్యతో అప్రమత్తమైన మహారాష్ట్ర ప్రభుత్వం బాలీవుడ్ సల్మాన్‌ఖాన్‌కు భద్రతను పెంచింది. వై-ప్లస్ కేటగిరీకి అప్‌గ్రేడ్ చేసింది. రెండేళ్ల తర్వాత ఆయనకు భద్రతను పెంచుతూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సల్మాన్ ఖాన్‌కు వై-ప్లస్ భద్రత (నలుగురు సాయుధ సిబ్బంది) ఉంటారు. కారుతో పాటు పోలీసు ఎస్కార్ట్ వాహనం ఉంటుంది. సల్మాన్ వెంట సాయుధ కానిస్టేబుల్ ఉంటారు. రెండేళ్లుగా లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి సల్మాన్‌కు పదే పదే బెదిరింపులు వస్తుండటంతో వై-ప్లస్ భద్రతను మహారాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

పాక్ సంకుచిత విధానాలు: భారత్

జెనీవా: పాకిస్థాన్ అనుసరించేవి సంకుచిత విధానాలని భారత్ విమర్శించింది. పాక్ ధోరణిని ఐక్యరాజ్య సమితి (ఐరాస) వేదికగా దుయ్యబట్టింది. ప్రజాస్వామ్యం, వైవిధ్యానికి భారత్ ప్రతీక అని వ్యాఖ్యానించింది. ఉగ్రవాదం, సంకుచిత విధానం, హింసకు మారుపేరు పాకిస్థాన్ అంటూ 'వలసపాలన'పై చర్చ సందర్భంగా జమ్మూకశ్మీర్ ప్రస్తావనను పాకిస్థాన్ తేవడంపై భారత్ దీటుగా స్పందించింది. 'బహుళత్వం, వైవిధ్యం, ప్రజాస్వామ్యానికి భారత్ ప్రతీక. ఇందుకు విరుద్ధంగా ఉగ్రవాదం, సంకుచిత విధానం, పీడించడం వంటి చర్యలకు పాక్ పెట్టింది పేరు. ప్రార్థనా మందిరాలు, మైనార్టీలు, వారి ఆలయాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడే చర్యలు సర్వసాధారణం' అని ఐరాసలో భారత ప్రతినిధి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ అన్నారు. అబద్ధాలు, నిరాధారమైన ఆరోపణల ద్వారా ఐరాస వేదికను పాకిస్థాన్ దుర్వినియోగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాకిస్థాన్ గత చరిత్రను చూస్తే ఇందులో ఎలాంటి ఆశ్చర్యం లేదన్నారు. పొరుగు దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి బదులు.. సొంతింటిని చక్కపెట్టుకోవాలని పాకిస్థాన్‌కు హితవు పలికారు. ప్రజాస్వామ్య విలువలకు భిన్నంగా పాకిస్థాన్ తీరుంటుందని మాథ్యూ పున్నూస్ వ్యాఖ్యానించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.